నదినీ వదల్లేదు..!

అక్రమార్కులు దేనినీ వదలడం లేదు. ప్రభుత్వ భూములు, కొండలు, గుట్టలు, వంకలు ఇప్పటికే కబ్జాదారుల కబంధ హస్తాల్లో ఉన్నాయి. ఇవి చాలవన్నట్లు వారి కన్ను గుంజననది పొరంబోకు భూములపై పడింది. రూ.100 కోట్ల విలువ చేసే ఆ భూములను కబ్జా చేసిన అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు వాటిని అనుభవించడంతో ప్లాట్లు వేసి దర్జాగా అమ్మేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా అధికార పార్టీలోని కొందరు పెద్ద నాయకుల అండ కబ్జాదారులకు పుష్కలంగా ఉండటంతో వారు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు.



నదిలోకి వచ్చేసిన పెద్ద గోడ

- రూ.100 కోట్ల విలువ చేసే గుంజన నది పొరంబోకు భూములు కబ్జా
- మరికొన్ని భూములు కాజేసే యత్నంలో అధికార పార్టీ నేతలు
- తప్పుడు సర్వే నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు
- చోద్యం చూస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 7: రైల్వేకోడూరు పరిధిలో నది పొరంబోకు భూములు సర్వే నెంబరు 1599-ఏలో 101.80 ఎకరాలు ఉన్నాయి. ఇందులో 50 ఎకరాలను కబ్జా చేశారు. ఇద్దరు అండదండలతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సిండికేటుగా మారి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు రైల్వేకోడూరులో ముమ్మరంగా చర్చ సాగుతోంది. కబ్జాదారులు ఓ ప్రజాప్రతినిధికి లక్షలు ముట్టజెప్పినట్లు సమాచారం. అదేవిధంగా ఒక అధికారికి కూడా లక్షలాది రూపాయలు చెల్లించినట్లు బాహటంగా చెప్పుకుంటున్నారు. నది పొరంబోకు భూములపై రైల్వేకోడూరుకు చెందిన ఒకరు (నెం.డబ్ల్యూ 21836/2015) హైకోర్టులో కేసు దాఖలు చేశారు. 2016-17 సంవత్సరంలో కోర్టు నది పొరంబోకు స్థలాలను స్వాధీనం చేసుకోవాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించింది. అయినా ఇక్కడి అధికారులు కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకోలేదు. తర్వాత లోకాయుక్తలో (కేసు నెం. 2418/2015) ఫిర్యాదు చేశారు. మళ్లీ లోకాయుక్త కూడా విచారించి భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. అయినా రైల్వేకోడూరులో కబ్జా పర్వం ఆగలేదు. దొంగపత్రాలు, తప్పుడు సర్వే నెంబరు వేసి కట్టడాలు చేశారు. నది పొరంబోకు భూములు సుమారు 30 ఎకరాలను తప్పుడు సర్వే నెంబరు 2042/1, 2, 3, 4, 2086గా సృష్టించి సుమారు మరో 20 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. సర్వే నెంబరు 635 వేసి 75 సెంట్ల ప్రభుత్వ నది పొరంబోకు స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్లాట్లు వేసి, రోడ్లు వేసి దర్జాగా విక్రయాలు చేశారు. రైల్వేకోడూరుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి, అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల దండదండలతో కబ్జా చేసిన స్థలాల్లో పాట్లు వేసి విక్రయించి కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. మైసూరివారిపల్లె నుంచి చిట్వేలి రోడ్డు వరకు నది పొరంబోకు స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేశారు. ప్రజాప్రతినిధులకు, బడా నాయకులకు, అధికారులకు డబ్బులు ఇస్తున్నామని, ఎవరి వల్ల ఏమీ కాదని కబ్జాదారులు బాహటంగా చెబుతున్నారు. పాతబజారుకు సమీపంలో ఒక తోట ఉండేది. అయితే ఆ తోటను భూమి గల వారు అమ్మేశారు. కొన్న రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తీసుకుని తోటలో ఉండే చెట్లను నరికివేసి ప్లాట్లు చేశారు. ఈ స్థలం పక్కనే గుంజన నది ఉంది. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, తప్పుడు సర్వే నెంబరు వేసి 75 సెంట్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని విక్రయాలు సాగించారు. నదికి పక్కనే గోడను కట్టారు. ఈ స్థలం జోలికి ఎవరూ రాకుండా ఉండాలని ఓ ప్రజాప్రతినిధికి రూ.30 లక్షలు, ఓ అధికారికి రూ.10 లక్షలు, మరో వ్యక్తికి రూ.10 లక్షలు ఇచ్చారని రైల్వేకోడూరులో చెప్పుకుంటున్నారు. డబ్బులు తీసుకున్న ఓ ప్రజాప్రతినిధి రియల్ ఎస్టేట్ వ్యాపారి తన మాట వినలేదని, పుల్లంపేటకు చెందిన ఒక బడా నాయకుడితో సంబంధాలు ఉన్నాయన్న కోపంతో ఓ ప్రముఖ వ్యక్తిని పురమాయించి జిల్లా స్థాయి అధికారుల నుంచి డివిజన్ స్థాయి అధికారుల వరకు ఫిర్యాదులు చేయించి నిర్మాణంలో ఉన్న గోడతో పాటు పిల్లర్లను పడగొట్టించారు. నది పొరంబోకు స్థలాలకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడం, తప్పుడు సర్వే నెంబర్లు వేయించడంతో ఇక్కడ సిద్ధహస్తులు ఉన్నారు. వారికి ఖాళీగా ఉన్న భూమి కనిపించిందంటే చాలు రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు చెప్పి ఇలా చేసుకుంటే మీకు లాభాలు దండిగా వస్తాయని చెప్పడం సలహాలు, సూచనలు చెప్పిన సిద్ధహస్తులకు భారీ మొత్తంలో డబ్బులు ఇవ్వడం లాంటివి రైల్వేకోడూరులో జోరుగా సాగుతున్నాయి. ఇదిలా ఉండగా ఎన్నికలు సమీపిస్తుండడంతో కొందరు నాయకులు ఉన్నది చక్కబెట్టుకోవాలని చూస్తున్నారు. ఈ క్రమంలో మైసూరివారిపల్లె ప్రధాన దారి ప్రైవేటు మార్కెట్‌యార్డు పక్కనే ఖాళీగా సుమారు 50 సెంట్ల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు విపరీతంగా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇది కోట్లాది రూపాయల విలువ చేస్తుంది. అధికార పక్షం నేత ఒకరు ఏకంగా 2.5 ఎకరాల భూమిని కాజేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అదే విధంగా చిట్వేలి రూటులో చాలామంది తప్పుడు సర్వే నెంబర్లు వేసుకుని ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. వారందరికీ రెవెన్యూ శాఖాధికారులు గతంలో నోటీసులు జారీ చేశారు. మైసూరివారిపల్లె నుంచి చిట్వేలి రూటు వరకు రెవెన్యూ శాఖాధికారులు కబ్జాదారులకు నోటీసులు ఇచ్చినా ఫలితం లేదు. కబ్జాలు మాత్రం జరుగుతూనే ఉన్నాయి. కాగా వివాదంలో ఉన్న ఒక సినిమా థియేటర్‌ను ఇటీవల కొందరు నాయకులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కలసి కొనుగోలు చేశారు. దాని ముందు భాగంలో ఉన్న రోడ్లు భవనాల శాఖకు చెందిన 50 సెంట్ల భూమిని కాజేసేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. కాగా కబ్జా చేసిన స్థలాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ కూడా ఇచ్చారు. కబ్జా చేసిన స్థలాల జోలికి ఎవరూ రాకుండా ఉండేందుకు ఇద్దరు ద్వితీయ శ్రేణి నాయకులకు 10 సెంట్ల చొప్పున స్థలం ఇవ్వడంతో వారు ఆ స్థలంలో రెండు భవనాలు కూడా నిర్మించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నది పొరంబోకు స్థలంలో నిర్మించిన గోడ



నది పొరంబోకు స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు..

నది పొరంబోకు స్థలాలను ఆక్రమణలు చేయకూడదు, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కబ్జాలను చాలా వరకు తొలగిస్తున్నాము. కబ్జాకు గురైన కొన్ని స్థలాలను పరిశీలిచాము. కొందరు కోర్టులో కేసు వేయడంతో వాటిపై మళ్లీ కౌంటర్స్ వేశాము. నది పొరంబోకుకు సంబంధించిన స్థలాలను ఎవరూ కాజేసే యత్నం కాని, ఆక్రమణలు గాని చేయకూడదు, అలా చేస్తే చర్యలు తప్పవు. నది పొరంబోకు స్థలంలో కట్టిన గోడను ఇటీవల కూల్చివేశాము.

- అమరేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్



ఓ నేత ఆక్రమించిన 2.5 ఎకరాల నది పొరంబోకు స్థలం



రైల్వేకోడూరు ప్రధాన దారికి పక్కనే ఉన్న స్థలాన్ని కాజేసేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ భూమి ఇదే

కోటపల్లె ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



మిమ్మల్ని నమ్మి ఎలక్షన్ ఎలా చేయగలం

- పీలేరు అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- తహసీల్దారుకు షోకాజ్ నోటీసు జారీ

పీలేరు, ఫిబ్రవరి 7: 'మీరు ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రానికే నేను తనిఖీ కోసం వచ్చాను. మీరు పిలుచుకువచ్చిన పోలింగ్ కేంద్రం గురించి కనీస సమాచారం మీ వద్ద లేకపోతే ఎలా? పోలింగ్ కేంద్రాలకు సంబంధించి సిద్ధం చేసుకోవాల్సిన రికార్డుల గురించి రెండు రోజుల క్రితం వీడియో కాన్ఫరెన్సులో స్పష్టంగా చెప్పాను. అయినా మీరు సిద్ధం చేసుకోలేకపోయారా? అరకొర సమాచారంతో మీరు ఎంతో విలువైన నా సమయాన్ని వృథా చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా ఉన్న మిమ్మల్ని నమ్మి ఎలక్షన్ ఎలా చేయగలం' అంటూ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పీలేరు ఈఆర్‌వో రమాదేవి, తహసీల్దారు మహబూబ్ బాషాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా బుధవారం ఆయన పీలేరు పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. తొలుత పీలేరు పట్టణ పరిధిలోని కోటపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి రెండు పోలింగ్ కేంద్రాలను కోటపల్లె ప్రాథమిక పాఠశాలలోకి ఇటీవల మార్పు చేసిన విషయం తెలుసుకున్న ఆయన పోలింగ్ కేంద్రాల మార్పు గురించి ప్రజలకు తెలియజేశారా, తెలియజేసి ఉంటే ఏ విధంగా తెలియజేశారు, పోలింగ్ కేంద్ర ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు గుర్తించారా, ఎన్నికల కమిషన్ ఆదేశించిన మేరకు లేఔట్ వేశారా అంటూ అధికారులను ప్రశ్నించారు. వాటన్నింటికీ స్థానిక అధికారుల నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటపల్లె పోలింగ్ కేంద్రం పరిధిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, ఎంతమందిని తొలగించారు, ఎంతమంది కొత్త ఓటర్లను చేర్చారు అంటూ బీఎల్‌వోను అడిగి తెలుసుకున్నారు. తుది ఓటరు జాబితా వచ్చిన తరువాత కొత్త దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, వాటన్నింటినీ ఏ విధంగా ప్రాసెస్ చేస్తున్నారు అంటూ బీఎల్‌వోను అడిగారు. వాటికి అతను కూడా సరైన సమాధానం చెప్పలేకపోవడంతో ఎన్నికల విధులకు సిద్ధంగా లేకపోవడమే కాకుండా క్షేత్రస్థాయి సిబ్బందిని కూడా సమాయత్తం చేయడంలో విఫలమయ్యారంటూ తహసీల్దారుకు షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ముంచుకొస్తున్నా పోలింగ్ కేంద్రాల ఎంపిక, వాటిలో సౌకర్యాల కల్పనలోనే ఆగిపోతే ఇతర పనులు ఎప్పుడు చేయగలమని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు నిర్దేశించిన పోలింగ్ కేంద్రంపై బీఎల్‌వోలు సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని, ఆ చుట్టుపక్కల పరిస్థితులపై పూర్తిగా పట్టు సాధించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం నిర్వహణకు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సెక్టోరల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తొలి పర్యటన, అటు ఈఆర్‌వో, ఇటు తహసీల్దారు కొత్త వారు కావడంతో సంస్థాగత లోపాలపై ఆయన చూసీచూడనట్లు పోతారని స్థానిక అధికారులు భావించినప్పటికీ ఆయన పర్యటన ఆద్యంతం వాడివేడిగా సాగింది. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో రంగస్వామి, ఈఆర్‌వో రమాదేవి, తహసీల్దారు మహబూబ్‌బాషా, ఆర్ఐ చాణక్య పాల్గొన్నారు.

మూలాల శోధనలో పోలీసులు!



- ఎస్పీ నేతృత్వంలో విచారణ బృందాల ఏర్పాటు
- ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు చూపిన కేవీ పల్లె పోలీసులు
- మిగిలిన వారి కోసం కొనసాగుతున్న గాలింపు

పీలేరు, ఫిబ్రవరి 7: ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో కానిస్టేబుల్ గణేశ్ ప్రాణాలు కోల్పోయిన సంఘటనను పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఆ సంఘటనలో ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని కేవీ పల్లె పోలీసులకు అప్పగించారు. మిగిలిన ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మంగళవారం ఉదయం నుంచి కేవీ పల్లె మండలంలోని అన్ని అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మంగళవారం నాటి ఘటనలో కారులో ఉన్న తమిళనాడుకు చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను బుధవారం అరెస్టు చేసినట్లు కేవీపల్లె ఎస్ఐ రహీముల్లా తెలిపారు. తమిళనాడు రాష్ట్రం కళ్లకుర్చి జిల్లా వళ్లిమలై తాలూకా కీలక్కడ్ గ్రామానికి చెందిన వి.కుబేంద్రన్, ఎ.రమేశ్‌లను అరెస్టు చేసి తిరుపతిలోని ఎర్రచందనం ప్రత్యేక కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రిమాండు విధించినట్లు ఆయన తెలిపారు. వారిపై తమ స్టేషన్‌లో ఐపీసీ 304(ఎ), 447, 379 సెక్షన్లతో పాటు ఫారెస్టు యాక్టు కింద క్రైమ్ నెం.16/2024గా కేసు నమోదు చేశామని ఆయన వెల్లడించారు. స్మగ్లర్లతో పాటు వారు ఉపయోగించిన స్విఫ్ట్ కారు, అందులోని 8 ఎర్రచందనం దుంగలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. తమకు దొరికిన స్మగ్లర్ల ద్వారా ఈ కేసులో మరో ఆరుగురికి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని, వారి కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా పర్యవేక్షణలో కలకడ సీఐ శ్రీనివాసులు, పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అజ్ఞాతంలోకి పాత స్మగ్లర్లు

ఎర్రచందనం స్మగ్లర్ల చేతిలో కానిస్టేబుల్ హతమైనట్లు తెలియగానే కేవీ పల్లె మండలానికి చెందిన పలువురు పాత స్మగ్లర్లు మంగళవారం ఉదయం నుంచే అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలిసింది. కేవీ పల్లె మండలానికి చెందిన పలువురు గతంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌లో ప్రత్యక్ష, పరోక్షంగా పాల్గొంటూ ఈ ప్రాంతంలో ఆకర్షణీయమైన జీవితం గడుపుతూ రాజకీయాల్లో కూడా ప్రవేశించారు. అధిక శాతం మంది వైసీపీలో ఉంటూ ఈ ప్రాంతంలో చక్రం తిప్పుతున్నారు. సంఘటన తీవ్రతను తెలిసిన వారు పోలీసులు తమపై ఉన్న పాత కేసులు ఎక్కడ తిరగతోడతారో లేక తమను ఎక్కడ అరెస్టు చేస్తారోనని భయపడి అజ్ఞాతంలోకి వెళ్లిపోయి తమ బంధువులను తమ ముఖ్య నాయకుడి వద్దకు రాయబారానికి పంపినట్లు తెలిసింది. ఆ క్రమంలో గతంలో పీడీ యాక్టు కింద అరెస్టు అయిన కేవీ పల్లె మండలానికి చెందిన ఓ మండల స్థాయి నేత మంగళవారం నుంచి కుటుంబం, వాహనాల సమేతంగా కనిపించకుండా పోయినట్లు స్థానికులు తెలిపారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కేవీ పల్లె మండలంలో అడపాదడపా ఎర్రచందనం స్మగ్లింగ్ ఘటనలు వెలుగు చూస్తున్నప్పటికీ ఆరు నెలలుగా ఎక్కువైపోయాయి. కేవీపల్లె, సుండుపల్లె మండలాల్లోని అధికార పార్టీ నేతలే స్మగ్లింగ్‌కు అండదండలు అందిస్తున్నారని, తమిళ స్మగ్లర్లకు సహాయపడుతూ మామూళ్లు వసూలు చేసుకుంటున్నారని చాలాసార్లు ఫిర్యాదులు చెలరేగాయి. ప్రస్తుతం అటువంటి వారందరి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. గత మూడు నెలలుగా వారి కదలికలను పరిశీలించేందుకు వారి మొబైల్ నెంబర్లను సేకరించి వారి కాల్ డేటా రికార్డులను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.



ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న కేవీ పల్లె పోలీసులు

వైసీపీ ప్రభుత్వంలో పోలీసులకు రక్షణ ఉందా..?

- మంత్రి పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే ఎర్రచందనం అక్రమ రవాణా
- టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, ఫిబ్రవరి7 : వైసీపీ ప్రభుత్వంలో పోలీసులకు రక్షణ లేకుండాపోయిందని, ఎర్రచందనం స్మగ్లర్ల ఆగడాలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయని, టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. స్థానిక హరిత హోటల్‌లో ఒంటిమిట్ట టీడీపీ నాయకులతో సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్ల ఆగడాలు రోజురోజుకు ఎక్కువయ్యాయని, మంత్రి పెద్దిరెడ్డికి కనుసన్నల్లోనే ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందని తెలిపారు. స్మగ్లర్లకు అసెంబ్లీ టికెట్లు కూడా ఇస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పోలీసులకు కూడా రక్షణ లేదని, ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో చనిపోయిన కానిస్టేబుల్ గణేశ్ మృతిపై మంత్రి పెద్దిరెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మానసిక ఆవేదనలో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదని, అందుకే జగన్‌రెడ్డి అవినీతి చక్రవర్తిగా, అక్రమమార్గంలో సంపాదించిన డబ్బుతో సిద్ధమంటూ వందల కోట్ల రూపాయలతో పెద్ద పెద్ద కటౌట్లు పెడుతున్నారని విమర్శించారు. సిద్ధం కటౌట్లు చూసినా ప్రతిసారీ ప్రభుత్వం పెట్టిన బాధలు, బాదుడు, హింస, జగన్‌రెడ్డి ప్రభుత్వంలో తరలిపోయిన పరిశ్రమలే గుర్తుకు వస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో బటన్ నొక్కితే జగన్‌రెడ్డికి దిమ్మ తిరిగి బొమ్మ కనపడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుమారి శివారెడ్డి, యువ నాయకులు హరినాథరెడ్డి, డాక్టర్ శివకుమార్, మామిళ్ల శ్రీహరి, కొండల తీర్పు రాజగోపాల్‌రెడ్డి, ఒంటిమిట్ట సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మోదుగుల నరసింహులు, బి.వి.రమణ, నల్లగొండు గంగిరెడ్డి, చామా శరత్‌కుమార్‌రెడ్డి, సుబ్బరాయుడు, లక్ష్మీరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రాచపల్లి చౌడయ్య, సాలాబాదు చౌడయ్య, మలకాటిపల్లె దాసు, మలకాటిపల్లె కృష్ణ, మైనారిటీ నాయకులు రంతూ, షాహుస్సేన్, మౌలా తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని టీడీపీ నాయకులతో చర్చిస్తున్న జగన్‌మోహన్‌రాజు

ఏదీ మెడికల్ హబ్..?

- అట్టహాసంగా డిసెంబరులో సీఎంచే ప్రారంభం..
- ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని వైద్యసేవలు
- ఆసుపత్రికి చేరని వైద్య పరికరాలు
- వసతుల కల్పనలో ప్రభుత్వం అలసత్వం
- ఇదీ సీఎం సొంత జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పరిస్థితి

ఇంకా వైద్యసేవలు అందుబాటులోకి రాని క్యాన్సర్ కేర్ ఆసుపత్రి





రోగులు కూర్చునే కుర్చీలూ మూలకే..

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 7: కడప నగర శివారు లోని రిమ్స్ ఆమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో గత డిసెంబరు నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మూడు ప్రధాన ఆసుపత్రులను స్వయంగా వచ్చి ప్రారంభించారు. రూ.107 కోట్లతో క్యాన్సర్ కేర్ 100 పడకల ఆసుపత్రి, రూ.48.82 కోట్లతో మెంటల్ హెల్త్ కేర్ ఆసుపత్రి 100 పడకల సామర్థ్యంతో, రూ.125 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి 452 పడకల సామర్థ్యం ఉన్నట్టు ఈ సందర్భంగా అట్టహాసంగా ప్రకటించారు. ఇందులో సూపర్ స్పెషాలిటీ వైద్య పరికరాల కోసం రూ.50 కోట్లు, మెంటల్ హెల్త్ కేర్ ఆసుపత్రి వైద్య పరికరాలకు రూ.2.5 కోట్లు, క్యాన్సర్ కేర్ వైద్య పరికరాల కోసం రూ.58 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రే స్వయంగా వచ్చి తన చేతుల మీద ఎంతో ఆర్భాటంగా ప్రారంభించి, కడపను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దామని గొప్పలు చెప్పి వెళ్లారు. ఇవి కేవలం మాటలే కానీ చేతల్లో ఇంకా కార్యరూపం దాల్చలేదు.

క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభం అయ్యేనా

క్యాన్సర్ కేర్ ఆసుపత్రిలో ఇప్పటివరకు వైద్య సేవలను ప్రారంభించలేదు. ఆసుపత్రి భవనాల నిర్మాణం పూర్తి కానేలేదు. వైద్య సిబ్బంది నియామకాలు జరగనే లేదు. పరికరాలు అందుబాటులో లేనే లేవు. పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంటే ముఖ్యమంత్రి మాత్రం ఆసుపత్రిని ప్రారంభించి, సెల్ఫీలు తీసుకుని వెళ్లారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన వెంటనే క్యాన్సర్ కేర్ ఆసుపత్రి పనులు నత్తనడకన సాగుతున్నాయి. క్యాన్సర్ కేర్ ఆసుపత్రి ఎప్పుడు ప్రారంభిస్తారని సంబంధిత అధికారులను అడిగితే, సరైన సమాధానం లభించడంలేదు. భవనాలు పూర్తి కాలేదని, ఇంకా పర్మిషన్ ఇవ్వలేదని, పరికరాలు ఆసుపత్రికి చేరలేదని ఇలా ఏవేవో సాకులు చెప్తున్నారు.

'మెంటల్'లో మౌలిక వసతుల్లేవ్

మెంటల్ హెల్త్‌కేర్ ఆసుపత్రిలో రోగులకు సేవలు అందిస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు ఇంకా కల్పించలేదు. రోగులకు తాగడానికి, అవసరానికి నీళ్లు లేవు. ఇక రోగుల వివరాలను పొందుపరచడానికి ఇంటర్‌నెట్ సౌకర్యం లేక, డేటా ఎంట్రీ ఆపరేటర్లు లేక, ఎఫ్ఆర్ఎస్ వేయలేక సతమతమవుతున్నారు. వసతులను కల్పించడంలో అధికారులు చొరవ చూపడంలేదనే విమర్శ వినిపిస్తోంది. రోగులకు ఏదైనా వైద్య పరీక్షలు చేయాలంటే సిబ్బంది లేక సర్వజన ఆసుపత్రికి పంపిస్తున్నారు. దూరం నుంచివచ్చే రోగులు ఓపీకి ఒక చోట, పరీక్షలు ఇంకో చోటకు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. వైద్య పరికరాలు, వైద్య పరీక్షలు నిర్వహించే సిబ్బంది (టెక్నీషియన్లు) లేక రోగుల బాధ వర్ణనాతీతం. అన్ని వసతులను కల్పించకుండానే ఆర్భాటంగా ప్రారంభించి అభాసుపాలైనట్లు ఉందని రోగులు అంటున్నారు.

సూపర్ స్పెషాలిటీ ఓపీకే పరిమితం

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కేవలం ఓపీకే పరిమితమైంది. ఐపీ ఇంకా ప్రారంభించలేదు. వైద్య పరికరాలు వినియోగంలోకి తీసుకురాలేదు. చివరికి మందులు సైతం సర్వజన ఆసుపత్రి నుంచే పొందుతున్నారు. సూపర్ స్పెషాలిటీకి వచ్చే రోగులు సైతం వైద్య పరీక్షల కోసం సర్వజన ఆసుపత్రినే ఆశ్రయించాల్సి వస్తోంది. అటూ ఇటూ తిరగలేక వైద్యం కోసం వచ్చే రోగులు ఎందుకొచ్చాంరా దేవుడా.. అని తల బాదుకునే పరిస్థితి తయారైంది.

ఏది ఏమైనా సీఎం సొంత జిల్లాలో వైద్య సేవలు పొందాలంటే రోగులు చాలా వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఆసుపత్రుల్లో వైద్య సేవలు, వసతులను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే భావన, వాదన ప్రజల్లో, రోగుల్లో బలంగా వినిపిస్తోంది. పబ్లిసిటీకోసం చూపిన శ్రద్ధ సౌకర్యాల కల్పనలో చూపించి ఉంటే బాగుండేదని రోగులు అంటున్నారు.

బిల్లులు రావని వైద్యపరికరాలకు బ్రేక్ ?

క్యాన్సర్ కేర్, హెల్త్‌కేర్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించి రెండు నెలలు అవుతున్నా ఇంకా వైద్య పరికరాలు రాలేదు. దీనికి కారణం బిల్లులు రావనే భయంతో సంబంధిత కాంట్రాక్టర్ వైద్య పరికరాలను ఆసుపత్రులకు అందజేయలేదని తెలిసింది. త్వరలోనే ఎన్నికలు ఉండడం, ప్రభుత్వం మారితే బిల్లులు ఆగిపోతాయేమోనని వైద్యపరికరాలను సరఫరా చేయడంలేదని ఆసుపత్రి వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

కడప నగర శివారులోని రిమ్స్ వద్ద నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ, మెంటల్ హెల్త్ కేర్, క్యాన్సర్ సెంటర్ ఆసుపత్రి భవనాలను సీఎం వైఎస్ జగన్ గత ఏడాది డిసెంబరులో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ మేరకు పెద్ద ఎత్తున పబ్లిసిటీ చేసుకున్నారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభం అయింది కదా.. ఇక తమకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందని ఉమ్మడి జిల్లా ప్రజలు సంతోషించారు. ఇప్పటికి దాదాపు రెండు నెలలు అవుతోంది. సీఎం జగన్ ప్రచారానికి తప్ప.. పేదల వైద్యానికి ఈ ఆసుపత్రులు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఎప్పటికి అందుబాటులోకి వస్తాయో కూడా తెలీని పరిస్థితి. క్యాన్సర్ అసుపత్రి ఇంకా ప్రారంభమే కాలేదు. మిగిలిన వాటిల్లో వైద్య పరికాలే లేవు. ఇదీ ఇక్కడ అందుతున్న సూపర్ వైద్యం తీరు.



క్యాన్సర్ కేర్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులోకి రాకపోవడంతో లోపల ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం

త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి..



మెంటల్ హెల్త్ కేర్ ఆసుపత్రిలో చాలా వరకూ వైద్య సేవలు అందుతున్నాయి. సూపర్ స్పెషాలిటీలో ఓపీ సేవలు ప్రారంభమయ్యాయి. సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు. క్యాన్సర్ కేర్ మాత్రం ఇంకా ప్రారంభించ లేదు. బిల్డింగ్ మరియు వైద్య పరికరాలు, సిబ్బంది కొరత ఉంది. త్వరలోనే రోగులకు అందుబాటులోకి తెస్తాం.

- డాక్టర్ రమాదేవి, సూపరింటెండెంట్, సర్వజన ఆసుపత్రి, కడప

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య


ధనుంజయ మృతదేహం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 7: రాయచోటి పట్టణంలోని రవి థియేటర్ సమీపంలో గల రామాలయం సమీపంలో నివాసం ఉంటున్న ధనుంజయ (36) బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి వివరాల మేరకు.. ఆర్థిక ఇబ్బందులు, వివాహం కాలేదనే మనస్థాపానికి గురై ఇంట్లోని మోల్డింగ్ కడ్డీకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న ఆ యువకుడిని అతని తల్లి చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


పెంచలయ్య మృతదేహం

పుల్లంపేట, ఫిబ్రవరి 7: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రెడ్డిపల్లె అరుంధతివాడకు చెందిన గనేరు పెంచలయ్య (40) ఏ పనిలేకుండా మద్యానికి అలవాటుపడి తిరుగుతుండేవాడు. భార్య, పిల్లలను ఇబ్బంది పెడుతూ డబ్బుల కోసం వేధించేవాడు. చివరకు ఇంట్లో ఉన్న మేకలను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా భార్య పద్మశాలి అడ్డుకుంది. ఈ క్రమంలో మద్యానికి డబ్బులు దొరకక మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని, దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గడ్డి వామి దగ్ధం


మంటల్లో కాలిపోతున్న గడ్డి వామి

కాశినాయన ఫిబ్రవరి7: మండలంలోని కొండ్రాజుపల్లెలో బుధవారం సుబ్బయ్య అనే రైతుకు చెందిన వరి గడ్డి వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిపోయిందని గ్రామస్థులు తెలిపారు. వామినుంచి మంటలు రావడం గుర్తించిన స్థానికులు వెంటనే పోరుమామిళ్ల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చే సమయానికే వరిగడ్డి మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో రైతుకు దాదాపు రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గోపవరం, ఫిబ్రవరి 7 : మండల పరిధిలోని ప్రాజెక్టు కాలనీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంటిమిట్టకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంలో పీపీ కుంట నుంచి ఒంటిమిట్టకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ ప్రసాద్‌ను బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

102 బియ్యం బస్తాలు పట్టివేత


బియ్యం బస్తాలు పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

చెన్నూరు, ఫిబ్రవరి 7: చెన్నూరు అరుంధతీవాడలో కొండూరు హరిక్రిష్ణకు చెందిన షెడ్డులో నిల్వ ఉంచిన 102 బియ్యం బస్తాలను కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు బుధవా రం పట్టుకున్నారు. 102 బస్తా లు పట్టుబడగా, వాటి విలువ రూ.1,94,481 ఉంటుందన్నారు. జిల్లా విజిలెన్స్‌అధికారి షేక్ మసుంబాషా ఆదేశాల మేరకు ఈ దాడులు చేసి.. చెన్నూరుకు చెందిన వీరబ్రహ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఈదురుబాషా, బాలగంగాధర్‌రెడ్డి, మనోజ్, సాయి ప్రసాద్, సుదర్శన్, జనార్ధన్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో అగ్నిప్రమాదం


షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన కంప్యూటర్ గది

చిట్వేలి, ఫిబ్రవరి 7: చిట్వేలి సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. సబ్ రిజిస్ట్రారు ఎం.శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. కంప్యూటర్ గదిలో షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని, ఈ ఘటనలో కంప్యూటర్ సామగ్రి, బ్యాటరీలు, తదితర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. దీంతో కార్యాలయంలో మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. కాగా డాక్యుమెంట్స్ పక్కనే ఉన్న గదిలో భద్రపరచడంతో వాటికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు సుమని ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వీరి వెంట ఆర్ఐ శేషంరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్నానది శివార్లలో మట్టి అక్రమ రవాణా

రెండు ఎక్స్‌కవేటర్ల పట్టివేత


పోలీసు స్టేషన్ ఆవరణంలో ఉన్న ఎక్స్‌కవేటర్లు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 7 : జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్ పోలీసు సిబ్బంది బుధవారం పెన్నానదిలో రెండు ఎక్స్‌కవేటర్‌లను పట్టుకున్నారు. పెన్నానది శివార్లలో ఎక్స్‌కవేటర్ల ద్వారా మట్టిని తవ్వి ట్రాక్టర్లకు నింపుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఎక్స్‌కవేటర్లను జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలో పెట్టారు. వీటికి సంబంధించి జమ్మలమడుగు అర్బన్ ఎస్ఐ సుబ్బారావును 'ఆంధ్రజ్యోతి' అడుగగా పెన్నానదిలో ట్రాక్టర్లకు మట్టి నింపుతుండగా తమ సిబ్బంది పట్టుకుని తెచ్చినట్లుగా ఆయన తెలిపారు.

నగదు బ్యాగు పోగొట్టుకున్న మహిళ

దొరికిన బ్యాగును తిరిగి అప్పగించిన ఏఆర్ కానిస్టేబుల్ శంకరయ్య

కడప (క్రైం), ఫిబ్రవరి 7: రోడ్డుపై వంద రూపాయలు నోటు చిక్కితే అటూ ఇటూ చూసి ఆ నోటును చటుక్కున జేబులో వేసుకుని వెంటనే అక్కడ నుంచి జారుకునే ఈ రోజుల్లో ఓ ఏఆర్ కానిస్టేబుల్ తనకు దొరికిన నగదుతో కూడిన బ్యాగును బాధితురాలికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్న సంఘటన కడప నగరంలో చోటు చేసుకుంది. చెన్నూరు నుంచి షాపింగ్ నిమిత్తం లక్ష్మీదేవి అనే మహిళ కడప నగరానికి బుధవారం సాయంత్రం నగదుతో కూడిన తన బ్యాగు పోగొట్టుకుంది. అందులో 125 కువైట్ దినార్లతో పాటు రూ.20 వేలు నగదు ఉంది.

స్థానిక పాతబస్టాండులో పూలంగళ్ల వద్ద దారిలో వెళుతూ బ్యాగు పోగొట్టుకుంది. అక్కడే పూలను కొనడానికి వెళ్లి ఏఆర్ కానిస్టేబుల్ శంకరయ్య (పీసీ 3124)కు ఆ బ్యాగు కంటపడింది. అది ఎవరిదని ఆరా తీయగా తమది కాదని అక్కడ వారు తెలిపారు. బాధితులు వస్తే తనకు ఫోను చేయాలని కానిస్టేబుల్ అక్కడ వారికి తన ఫోను నెంబరు ఇచ్చాడు. అయితే అదే మార్గంలో బ్యాగును పోగొట్టుకున్న ఆ మహిళ వెదుకుతూ అక్కడి వారి సమాచారంతో శంకరయ్యకు ఫోను చేసింది. వెంటనే ఆ ఏఆర్ కానిస్టేబుల్ వచ్చి బాధితురాలికి ఆ బ్యాగును అందించారు. దీంతో బాధితురాలు లక్ష్మీదేవి ఆ కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది. విషయం తెలుసుకున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్ శంకరయ్యను అభినందించారు.

జగన్‌రెడ్డి పాలనలో దళితులపై దమణకాండ

- యథేచ్ఛగా దాడులు, హత్యలు.. మానభంగాలు
- ప్రేక్షకపాత్రలో పోలీసులు, అధికారులు
- వైసీపీ మరోసారి గెలిస్తే రాష్ట్రం రావణకాష్టం
- 11న రాజమండ్రిలో దళిత సింహగర్జన
- పాత్రికేయుల సమావేశంలో మాజీ ఎంపీ హర్షకుమార్


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 7: ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతిరోజూ రాష్ట్రంలో ఏదో ఒకప్రాంతంలో దళితులపై వైసీపీ పెత్తందారుల దమనకాండ కొనసాగుతోందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. బుధవారం కడప ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన దళిత సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో దళితులన్నా.. దళిత వైద్యులన్నా.. దళిత మహిళలన్నా.. దళిత ఉద్యోగులన్నా.. దళిత యువత అన్నా లెక్కలేని తనంతో నీచంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ఆసుపత్రిలో మాస్కులు లేవన్న దళిత వైద్యుడైన సుధాకర్, కడపలో పశువైద్యుడు డాక్టర్ అచ్చన్నల పట్ల వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. వీరిద్దరి చావుకు వైసీపీ పెత్తందారీ పోకడే కారణమన్నారు. వైసీపీ దుర్మార్గాలను ప్రశ్నించిన పాపానికి వెంకాయమ్మను పొట్టన పెట్టుకున్న తీరు దారుణమన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి స్వంత జిల్లా పులివెందులలో దళితమహిళ అయిన నాగమ్మను కిడ్నాప్ చేసి మరీ మానభంగంతో హత్యచేసినా ఇంతవరకూ అతీగతీలేదన్నారు. వైసీపీ పెత్తందారుల, నాయకుల కనుసన్నల్లో కొంతమంది గూండాలు, రౌడీలు గ్రామ, మండలాలు, నియోజకవర్గాలు జిల్లా కేంద్రాలలో పనిగట్టుకుని దళితుల భూములు, స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నా అడ్డుచెప్పేనాధుడే లేరన్నారు. ఏమిటీ అన్యాయమని ప్రశ్నించిన దళితులను బెదిరించడం, దాడులకు బరితెగించడం, లేదంటే ఏకంగా హత్యచేయడం, మహిళలపై మానభంగాలకు బరితెగించడం పరిపాటిగా మారిందన్నారు. న్యాయంకోసం పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేదన్నారు. పైపెచ్చు పోలీసుల అండతోనే దళితులపై దమనకాండ సాగుతోందన్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదన్నారు. రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు దళితులు సిద్ధం కావాలన్నారు. గతంలో దళితులకు అందే 27 సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి పాలనలో అటకెక్కించి దళితుల నోట్లో మట్టికొట్టారన్నారు. దళితుల అభివృద్ధికోసం ఉన్న ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడం బాధాకరమన్నారు. విద్యను కూడా సక్రమంగా దళితులకు అందకుండా చేయాలనే కుట్రతో పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ లేకుండా చేశారన్నారు. నిరుద్యోగుల ఆశలపై గత 5 సంవత్సరాలుగా జగన్‌రెడ్డి నీళ్లు చల్లడంతో ఆయనపై గల విశ్వాసం పూర్తిగా తుడిచిపెట్టుకు పోయిందన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంతో పాటుగా జగన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పలికేందుకై రాజమండ్రి వేమగిరిలో ఈనెల 11వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు తలపెట్టిన దళిత సింహగర్జన సభను దిగ్విజయం చేసేందుకు జిల్లాలోని దళితులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దళిత సింహగర్జన కడప ఇన్‌చార్జ్ ఎం.విజయ్‌కుమార్, దళిత నాయకులు కె.ముత్తయ్య, ఆర్ఎన్ రాజా తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా అంకన్న


నాగుల అంకన్న

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 7: కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రారుగా డాక్టర్ నాగుల అంకన్న నియమితులయ్యారు. వైవీయూ ఆంగ్ల శాఖలో అసోసియేట్ ప్రొఫెసరుగా పనిచేస్తున్న నాగుల అంకన్నను నియమిస్తూ ఆ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మైలవరం మండలం బోగాల కట్ట గ్రామానికి చెందిన డాక్టర్ అంకన్న పాఠశాల విద్య జమ్మలమడుగులో పూర్తి చేశారు. ఇంటర్, డిగ్రీ అనంతపురంలో పూర్తి చేసి ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో పూర్తి చేశారు. 2009లో వైవీయూ ఆంగ్ల శాఖ అసిస్టెంటు ప్రొఫెసరుగా ఎంపికైన అంకన్న 2021లో అసోసియేట్ ప్రొఫెసరుగా పదోన్నతి అందుకున్నారు. యూనివర్సిటీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించా రు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ తాను పనిచేస్తున్న సంస్థల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అలాగే రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడతామని స్పష్టం చేశారు.

పరిశోధనల్లో ఆధునిక విధానాలు అనుసరిద్దాం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 7: సాంప్రదాయ విధానాలను విడనాడి ఆధునిక పద్ధతులను పరిశోధనల్లో వినియోగించి జంతు జీవకోటిని కాపాడకుందామని వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాదరెడ్డి అన్నారు. బుధవారం వైవీయులో జరిగిన నైతికవిలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ప్రయోగశాలల్లో జంతువుల స్థానంలో ప్రత్యామ్నాయ విధానాలను అవలం భించడం పట్ల అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రయో గశాలల్లో వినియోగించే దిశగా మనం వెళ్లాలని తెలిపారు. సెమినార్ కన్వీనరు జువాలజీ అసోసియేట్ ప్రొఫెసరు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పరిశోధకులకు విలువైన సమాచారాన్ని ఈ సెమినార్ ఇచ్చిందన్నారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజియాలజీ విశ్రాంత ప్రొఫెసరు బీహెచ్‌రావు మాట్లాడుతూ జంతువులను బాధల నుంచి తప్పించే కొత్త మార్గాలను అన్వేషించే బాధ్యత పరిశోధకులపై ఉందన్నారు. శాంతిపట్నాగర్ అవార్డుగ్రహీత హైదరాబాదు టీడీఎఫ్‌టీ గ్రూపు లీడరు డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రిమినల్ ఇన్విస్టిగేషన్‌లో ఫ్రింగర్‌ప్రింట్స్ ఎలా వినియోగిస్తారన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈసదస్సులో డాక్టర్ వెంకటరమయణ, అనుప్రసన్న, వెంకటరమణారెడ్డి, మరియదాస్, మనస్వరి, స్కాలర్లు పాల్గొన్నారు

ఓపెన్ స్కూల్స్ కో-ఆర్డినేటర్‌గా శ్రీనివాసరాజు



రాయచోటిటౌన్, ఫిబ్రవరి 7: జిల్లా ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్‌గా రాయచోటి పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొండూరు శ్రీనివాసరాజును నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఆయన డీఈఓ కార్యాలయంలో డీఈవో శ్రీరామ్‌పురుషోత్తం సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. డీఈవో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బడి బయట పిల్లలను గుర్తించి ఓపెన్ స్కూల్స్ ద్వారా వారి నమోదు సంఖ్యను పెంచడమే కాకుండా ఉత్తీర్ణత శాతాన్ని పెంచి నిరక్ష్యరాస్యత లేకుండా చూడాలని, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలని ఆయన సూచించారు. అనంతరం శ్రీనివాసరాజు మాట్లాడుతూ తనకు ఇచ్చిన ఈ బాధ్యతను ఎటువంటి విమర్శలకు తావు లేకుండా అంకిత భావంతో నిర్వర్తిస్తానన్నారు. అందరి సహకారంతో జిల్లాలో డ్రాపౌట్స్ లేకుండా చూస్తామన్నారు.

10, 11 తేదీల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్



ఇన్‌స్పైర్ లోగో ఆవిష్కరిస్తున్న అధికారులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 7: జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ కార్యక్రమం 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డీఈవో రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం డీఈవో కార్యాలయంలో ఆయన ఇన్‌స్పైర్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా నుంచి ఎంపికైన 189 ప్రాజెక్టులను జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన కార్యక్రమాన్ని బద్వేలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమానికి ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని.. 189 ప్రాజెక్టులు ఇందులో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమానికి అబ్జర్వర్ ఢిల్లీ నుంచి వస్తున్నారని తెలిపారు. ఏ కారణాల చేత గైర్హాజరు కాకూడదని అన్నారు. మిగతా వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి సెల్‌నెం.9441035830కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీవో ప్రభాకర్‌రెడ్డి, ఏడీ దేవరాజ్, డి.రాజగోపాల్‌రెడ్డితో పాటు సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించండి


వసతులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ పీడీ శశికళ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 7: ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ పీడీ శశికళ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్సీ బాలసదనాన్ని ఆమె పరిశీలించారు. బాలసదనంలో అతి తక్కువ మంది పిల్లలున్నారని అంగన్వాడీ వర్కర్లు పిల్లలను బాలసదనంలో చేర్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ అరుణమ్మపై నాగేశ్వరరెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆమె తెలిపారు. లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాల్లోని 52 అంగన్వాడీ కేంద్రాలు నాడు-నేడు కింద ఎంపికయ్యాయని, ఆయా పాఠశాలలకు సంబంధించిన వారు బ్యాంక్‌ల్లో అకౌంట్స్ తెరవాలన్నారు.

పబ్బాపురం వద్ద రైతుల ఆందోళన

సికెదిన్నె, ఫిబ్రవరి 7: మండలంలోని పబ్బాపురం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ఇక్కడ 1989లో టీచర్స్ హౌసింగ్‌బోర్డు ఏర్పాటు చేసి 1460 ప్లాట్లు కేటాయించుకున్నారు. అయితే అప్పట్లో అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో రైతులు వారి స్థలాలను సాగు చేసుకుంటున్నట్లు అనంతరం కాలక్రమేణా చెర్లోపల్లె లేఅవుట్ ఏర్పడడంతో వారి ప్లాట్లకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో ఉపాధ్యాయులు వారి ప్లాట్లను అభివృద్ధి చేసుకునేందుకు కొలతలు వేసుకుంటుండగా రైతులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల వారు ఘర్షణ పడినట్లు తెలిసింది. అయితే ఈ విషయమై సీకే దిన్నె సీఐ శంకర్ నాయక్‌ను వివరణ కోరగా తమకు ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

నిత్యావసర సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి : జేసీ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సంబేపల్లె, ఫిబ్రవరి 7: నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం దేవపట్ల గ్రామం వైఎస్ఆర్ నగర్ వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్ వాహనం వద్దకు వెళ్లి పరిశీలించారు. సకాలంలో నిత్యావసర సరుకులు అందిస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. తూకాల్లో వ్యత్యాసం లేకుండా లబ్ధిదారులకు అందించాల్సిన బియ్యం, చక్కెర, కందిబేడలు సక్రమంగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృపావతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్వరాయసాగర్ చేపల వేలం

కడప(రూరల్) ఫిబ్రవరి7: వీరపునాయునిపల్లె మండలం కొమ్మద్ది గ్రామ పరిధిలోని సర్వరాయసాగర్ రిజర్వాయర్‌లో చేపలు పట్టుకొని అమ్ముకోవడానికి గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్మద్ది గ్రామ సచివాలయంలో ఉదయం 10-30 గంటల నుంచి మధ్యాహ్నం 1-00 వరకు బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగల ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డుతో పాటు రూ.10,000లు సైకం చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. రిజర్వాయర్ గుత్త రూ.2,66,466 నుంచి మొదలవుతుందన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 7: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం సీటీఎం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (55) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు తెలుపు షర్టు, లుంగీ కట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైనా మిస్సింగ్ అయినట్లు తెలిస్తే 91331009537 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మద్యం విక్రేత అరెస్టు

ములకలచెరువు, ఫిబ్రవరి 7: అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని బురకాయలకోట హైవే రోడ్డు వద్ద మద్యం అమ్ముతున్న బావాజి(40)ని అరెస్టు చేసి అతని నుంచి ఎనిమిది మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ నజీర్ అహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య


పవిత్ర మృతదేహం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 7: రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామం దూళ్లవారిపల్లెలో బుధవారం అత్తింటి వేధింపులు భరించలేక పవిత్ర (25) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... చక్రాయపేట మండలానికి చెందిన పవిత్రను ఐదు సంవత్సరాల క్రితం రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామం దూళ్లవారిపల్లెకు చెందిన సురేశ్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలంగా భర్తతో పాటు అత్తింటి వారు అదనపు కట్నం కోసం తరచూ గొడవలు పడేవారన్నారు. దీంతో మనస్థాపానికి గురైన పవిత్ర (25) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ మహబూబ్‌బాషా, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి విచారించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు.

జాతీయ స్థాయిలో రిమ్స్ వైద్య విద్యార్థుల ప్రతిభ


వైద్య విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 7: తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ వైద్య కళాశాలలో గత వారం నిర్వహించిన జాతీయ సదస్సులో రిమ్స్ వైద్య విద్యార్థులు విజయం సాధించి తమ సత్తా చాటారు. అక్కడ నిర్వహించిన క్విజ్ పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన రిమ్స్ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగపు పీజీ వైద్య విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయిలో జరిగిన పబ్లిక్ హెల్త్, వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించడం జరిగింది. మొదటి స్థానాన్ని డాక్టర్ బ్లెస్సిన్ రాజా, ద్వితీయ స్థానాన్ని డాక్టర్ జ్యోతిష్, డాక్టర్ హరిత, డాక్టర్ కారుణ్య, డాక్టర్ రాహుల్ కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతి డాక్టర్ గోపిక్రిష్ణ, వైద్య, వైద్యేతర సిబ్బంది అభినందించారు.

నాన్‌స్టాప్ బస్సులకు భాకరాపేటలో స్టేజీ

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 7 : కడప డిపో నుంచి తిరుపతికి వెళ్లే నాన్‌స్టాప్ సర్వీసు బస్సులకు భాకరాపేటలో ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం భాకరాపేటలో తిరుపతి నాన్‌స్టాప్ బస్సులకు టికెట్స్ ఇచ్చేందుకు వీలుగా కండక్టర్స్ అందుబాటులో ఉంటారన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం : ప్రయాణికుల అభిప్రాయాలు, సూచనలు సలహాలు, సమస్యలను తెలుసుకునేందుకు వీలుగా ఈనెల 8వ తేదీ గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్న కడప డిపో మేనేజర్ తెలిపారు. 9959225774 అనే నెంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు.

దివ్యమంగళదేవి అలంకారంలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 7: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లి అమ్మవారు బుధవారం రౌద్రం, దివ్యమంగళ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారు పార్వేట తిరుణాల అనంతరం ప్రతి రోజు ప్రత్యేక అలంకారంతో గంగమ్మతల్లి భక్తులకు దర్శమిస్తారని, జాతర ముగిసినంత వరకు ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈఓ రవీంద్రరాజు, ఛైర్మన్ నరసింహా రెడ్డి తెలిపారు. సిబ్బంది, అర్చకులు భక్తులకు అన్ని వసతులు కల్పించారు.


అలంకారంలో గంగమ్మతల్లి

సీనియర్ న్యాయవాదికి సన్మానం

నందలూరు, ఫిబ్రవరి 7: బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది గొబ్బిళ్ల సుబ్బరామయ్య ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు ప్యానల్ లాయర్‌గా నియమించబడ్డ సందర్భంగా స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ షఫీఉల్లా ఖాన్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్ అలీ, సీనియర్ న్యాయవాదులు సురేష్, ఆనందకుమార్, జూనియర్ న్యాయవాదులు నూర్, మోహన్, మీన తదితరులు పాల్గొన్నారు.


సుబ్బరామయ్యను సత్కరిస్తున్న న్యాయవాదులు

భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 7: గ్రామీణ పారిశ్రామిక భారత్ బంద్ ఈ నెల 16న జరగనుందని, జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు మలిశెట్టి రాహుల్ తెలిపారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేసిందన్నారు. దేశంలో ఉన్న విద్యుత్, బ్యాంకింగ్, ఎల్ఐసీ, పోస్టల్, ఎయిర్‌లైన్స్ రైల్వే రవాణా, అటవీ పోర్టు, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పిందని ఆరోపించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు క్రిష్ణప్ప మాట్లాడుతూ వ్యవసాయం, ఉపాధి హామీ పథకాలకు అరకొర నిధులు కేటాయించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాధాక్రిష్ణయ్య, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మణిలు మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నరసింహులు, సీపీఐ మండల కార్యదర్శి డి.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షురాలు అజీమాబీ, రైతు సంఘం నాయకులు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడుతో టీడీపీ నేతల చర్చలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 7: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో బుధవారం విజయవాడ పార్టీ కార్యాలయంలో రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, ప్రముఖ న్యాయవాది కేజేపీ రెడ్డయ్యనాయుడులు రైల్వేకోడూరు రాజకీయంపై చర్చించారు. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ బలోపేతమైందని, అభ్యర్థి విజయానికి ఢోకా లేదని పార్టీ అధిష్టానానికి వివరించామని తెలిపారు. రైల్వేకోడూరు, పెనగలూరు, పుల్లంపేట, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా తిరుగుతూ వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను, టీడీపీ హామీలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. అచ్చెన్నాయుడుతో కోడూరు రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చలు నిర్వహించినట్లు వారు తెలిపారు.


అచ్చెన్నాయుడికి పుష్పగుచ్ఛం ఇస్తున్న విశ్వనాథనాయుడు, తదితరులు

ఏవోగా బాలాజీరాజు

రాయచోటి(కలెక్టరేట్),ఫిబ్రవరి 7: కలెక్టరేట్ ఏవోగా బుధవారం బాలాజీరాజు బాధ్యతలు తీసుకున్నారు. ఈయన అనంతపురం జిల్లా ఏవోగా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లాకు వచ్చారు. ఎన్నికల సమయంలో బాధ్యతగా పనిచేస్తానని వారు చెప్పారు. కాగా ఇక్కడ ఏవోగా పనిచేసిన బాలక్రిష్ణ ఆరోగ్యశ్రీ డిప్యూటీ డైరెక్టరుగా విజయవాడకు బదిలీపై వెళ్లారు.



రూ.20 వేల ఆర్థిక సాయం

నందలూరు, ఫిబ్రవరి 7: మండలంలోని కుంపినీపురం గ్రామానికి చెందిన ఆచారి బ్రహ్మయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో ఆయన కుటుంబానికి రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకుడు అతికారి కృష్ణ రూ.20 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. ఈ నేపథ్యంలో ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల నాయకుడు కోనేటి శివప్రసాద్, నారాయణ, కుంపినీపురం గ్రామ మాజీ సర్పంచ్ సాయి ఆనంద్, మురళీమోహన్, నరసింహులు, చేపల ఎల్లయ్య, గణపతి కనకయ్య, మేడా సురేష్, సాయి, శ్రీనివాసులు, బాష, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమే లక్ష్యం : రేవతి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 7: నియోజకవర్గంలో వైసీపీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు టీడీపీ నియోజకవర్గ మహిళా నాయకురాలు నగరిపాటి రేవతి తెలిపారు. బుధవారం నియోజకవర్గంలోని కొండంపల్లె, రామసముద్రం, దండ్లోపల్లి, రంగంపల్లె, పెరియవరం, టి.కమ్మపల్లె, చాపల అరుంధతివాడ తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ రైల్వేకోడూరులో ఎమ్మెల్యే నాలుగు సార్లు విజయం సాధించినా ఏం ఉద్ధరించారన్నారు. దళితులు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, రాజంపేట పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు తేనేపల్లి చిన్నా, దళిత నాయకులు మహేష్, గోపీ, వెంకటేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల వెయ్యి చీరలు పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నేతలు

రాజంపేట, ఫిబ్రవరి 7: రాజంపేట పట్టణంలోని సాతుపల్లి, ఈడిగపాలెం, ఎర్రబల్లి తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు, గంటా చారిటబుల్ ట్రస్ట్ అధినేత గంటా నరహరి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వెయ్యి చీరలు పంపిణీ చేశారు. సాతుపల్లిలోని సుమారు 500 మంది మహిళలకు, ఎర్రబల్లి ప్రాంతంలో 200 మందికి, ఈడిగపాలెంలో 300 మంది మహిళలకు పంపిణీ చేశారు. సాతుపల్లిలో టీడీపీ మహిళా మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్యవతి, రాజంపేట మహిళానేత పిడికిటి రత్నాదేవి, నందవరపు సునంద, మద్దిపట్ల ఇందిర, ముమ్మినేని విజయనిర్మల చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు సంతోష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు, అదే విధంగా ఈడిగపాలెం, ఎర్రబల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మైనార్టీ నాయకుడు కరిముల్లా, గంటా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు భరత్, ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

రాజంపేట, ఫిబ్రవరి 7: పట్టణంలో టీడీపీ నేత గంటా నరహరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను బుధవారం రాజంపేట పార్లమెంటు టీడీపీ కార్యదర్శి నాగమునిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్‌ను పరిశీలించి పేదలకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలను రుచిచూశారు. పేదలకు అన్నదానం నిర్వహించి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో అన్న క్యాంటీన్ ప్రతినిధులను భరత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన జగన్ ప్రభుత్వం

● బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 7: రైతులకు ఇచ్చిన హామీలను జగన్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్రనాథరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లతో కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు నిధులు ఇచ్చినప్పటికి ప్రైవేటు ఇండ్రస్ట్రీస్ వారికి ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకపోవడం వల్ల రైతులకు డ్రిప్ ఇరిగేషన్, తుంపర పనిముట్లు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జయప్రకాష్‌నాయణవర్మ, రైల్వేకోడూరు కన్వీనర్ చంగల్‌రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 7: జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బుధవారం రాయచోటి అర్బన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపాలిటీలోని డైట్ పాఠశాల, బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల, కొత్తపేట రామాపురం హైస్కూల్‌లో గల సుమారు 20 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు, ఇంజనీరింగ్ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో ఏ మాత్రం అలసత్వం వహించినా ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తప్పవని బీఎల్‌వోలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ కృష్ణారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ముస్లిం మైనార్టీలకు అండగా టీడీపీ

● రాజంపేట పార్లమెంటు నేత సుగవాసి బాలసుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 7: ముస్లిం మైనార్టీలకు అండగా టీడీపీ ఎల్లప్పుడూ ముందుంటుందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. బుధవారం పట్టణంలోని కంసలవీధికి చెందిన పలువురు ముస్లిం మైనార్టీల ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లడంతో ముస్లిం మైనార్టీలు ఆత్మీయ స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలంతా టీడీపీకి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు ఇర్షాద్ అలీఖాన్, అతావుల్లా, జుబేర్, ఖాదర్‌హుస్సేన్, బాషా, ఖలీల్, ఖత్వాల్, మదార్‌తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నేతలు

ఉత్తమ ఫలితాలు సాధించాలి : ఎంఈవో-2

రామాపురం, ఫిబ్రవరి 7: మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఎంఈఓ-2 జయచంద్ర అన్నారు. మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల తరపున వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలో ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు విద్యాబోధన అందజేశారన్నారు. అనంతరం పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే ఎండీ అఫ్రోజ్‌బేగం, పాఠశాల ఛైర్మన్ ధర్మారెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు నుంచి శెట్టిపల్లెకు బస్ సర్వీస్

సంబేపల్లె, ఫిబ్రవరి 7: అన్నమయ్య జిల్లా పీలేరు ఆర్టీసీ డిపో నుంచి సంబేపల్లె మండలం శెట్టిపల్లెకు బుధవారం నుంచి నూతనంగా బస్ సర్వీస్ ఏర్పాటు చేశారు. పీలేరు నుంచి కలకడ, గుట్టపల్లె క్రాస్, పెద్దబిడికి, వడ్డెపల్లె క్రాస్ మీదుగా శెట్టిపల్లెకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. బస్సు ఉదయం 8.20 నిమిషాలకు, సాయంత్రం 4.20 నిమిషాలకు రోజుకు రెండు ట్రిప్పులు శెట్టిపల్లెకు వస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కాగా శెట్టిపల్లె గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.


శెట్టిపల్లెకు వెళ్లే బస్సు సర్వీసు వద్ద ప్రజలు

ఆరోగ్య కిట్లు పంపిణీ

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 7: రాజంపేట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కమిషనర్ రాంబాబు ఆధ్వర్యంలో పట్టణ ప్రజలకు ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్-2 కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య, సచివాలయ, మెప్మా సిబ్బంది సహకారంతో వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ప్రజలకు కావాల్సిన ఆరోగ్య కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మర్రి రవి, ఆసుపత్రి కమిటీ మాజీ ఛైర్మన్ వడ్డె రమణ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఐ

గాలివీడు, ఫిబ్రవరి 7: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆయన బుధవారం ఉదయం చీమలచెరువుపల్లె పంచాయతీలోని రెడ్డివారిపల్లెలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయని, పల్లెల్లోని ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలని, ఘర్షణలకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం పలు ఇళ్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ

సైబర్ నేరాలపై అవగాహన

చిన్నమండెం, ఫిబ్రవరి 7: మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన బెస్తపల్లిలో సైబర్ నేరాలపై ఎస్ఐ రమేశ్‌బాబుతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ ముఖ్యంగా యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఈజీ మనీకి అలవాటు పడి చాలా మంది మోసపోతున్నారన్నారు. కాగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వారం రోజులుగా యువత ప్రజలను అప్రమత్తం చేయడం మంచి కార్యక్రమమని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులను, ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, నవీన్‌కుమార్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న ఎస్ఐ రమేశ్‌బాబు

వాలీబాల్ విజేత నందలూరు జడ్పీహెచ్ఎస్

నందలూరు, ఫిబ్రవరి 7: స్వర్ణాంధ్ర మదర్‌ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూపు 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని, అథ్లెంటిక్స్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన రాజంపేట పార్లమెంటు స్థాయి వాలీబాల్ పోటీల్లో నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయం సాధించి ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ ముఖ్య అతిథులుగా విశ్రాంత రైల్వేస్టేషన్ మేనేజర్ అడ్వకేటు ఆనందకుమార్, లయన్ జిల్లా ఛైర్మన్ అబ్దుల్లా తదితరులు విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు శ్యామ్‌రాజ్, రోవర్స్ స్కౌట్ లీడర్ అరుణ్ కుమార్, స్కౌట్ సభ్యులు పాల్గొన్నారు.

సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి: ఏపీఎం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 7: డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు బ్యాంకు అధికారులతో మాట్లాడి నిధులు ఇప్పించాలని ఏసీ నిరంజన్ తెలిపారు. అనంతరం ఏపీఎం ఆర్మగం మాట్లాడుతూ సీఐఎఫ్, శ్రీనిధి, ఉన్నతి నిధులు సంఘ సభ్యుల అవసరాన్ని బట్టి మంజూరు చేసి పేదవారిని ఆర్థికంగా నిలిచేలా అభివృద్ధి వైపు నడిపించాలన్నారు. సంవత్సరం ముగింపు నాటికి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించడం వంటి టార్గెట్ పూర్తి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీసీలు దాము, హరి, మండల సమాఖ్య అధ్యక్షులు, ఆనిమేటర్లు సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

నందలూరు, ఫిబ్రవరి 7: జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి ముందస్తుగా నిర్వహించే ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని నందలూరు జూనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ లత పేర్కొన్నారు. వచ్చే నెల 9న జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి నందలూరు కోర్టు పరిధిలో గల పోలీసు అధికారులతో జడ్జి బుధవారం క్రైం మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో మన్నూరు సీఐ రవీంద్రనాథ్, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట ఎస్ఐలు మహమ్మద్ అబ్దుల్ జహీర్, సుభాష్ చంద్రబోస్, రఘురాం, ఎస్ఈబీ ఎస్ఐ సంధ్య, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 వేలు ఆర్థిక సాయం

సుండుపల్లె, ఫిబ్రవరి 7: ఇటీవల ఇల్లు కూలిన బాధితురాలికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు అందజేసినట్లు జనసేన నాయకుడు రాజా తెలిపారు. మండల పరిధిలోని పెదినేనికాల్వ పంచాయతీ బేరిపల్లిలో నంద్యాల లక్ష్మిదేవి అనే మహిళకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోవడంతో తక్షణ సహాయంగా ఈ సాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఒంటేరు రాజా, సలీం, మున్నా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడీని కలిసిన పీఆర్‌టీయూ నేతలు

రాయచోటిటౌన్,ఫిబ్రవరి 7: కడప డీఈవోగా పనిచేస్తూ పదోన్నతిపై నూతన ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన రాఘవరెడ్డిని బుధవారం కడపలోని ఆర్జేడీ కార్యాలయంలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్, జిల్లా అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ నేతలు కలిసి బొకేలు ఇచ్చి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ రాఘవరెడ్డి మాట్లాడుతూ మన పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతానికి, విద్యార్థుల ప్రమాణాల పెంపునకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు రామకృష్ణంరాజు, వేణుగోపాల్‌రావు, కొండూరు, మురళీమోహన్‌రాజు, పాలెం రాజా, వెంకట్రామరాజు, కులశేఖర్‌రెడ్డి, చలపతిరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆర్జేడీని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నేతలు

టీడీపీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటు

సిద్దవటం, ఫిబ్రవరి 7: మాధవరం మేజర్ గ్రామ పంచాయతీ పార్వతీపురం ప్లేగ్రౌండ్‌లో బుధవారం మండల క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటు పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం..ఆంధ్ర క్రీడలకు ఎటువంటి ఆదరణ లేదని, కేవలం పబ్లిసిటీ, ఆర్భాటాల కోసమే చేసినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.30 వేలు ఆర్థికసాయం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 7: రైల్వేకోడూరు పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన చికిత్స నిమిత్తం టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి బుధవారం రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాగభూషణం, సుబ్బరాయుడు, రామక్రిష్ణ, రమణ, సావిత్రమ్మ, బుజ్జమ్మ పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్‌తో సురక్షిత మంచినీరు

గాలివీడు, ఫిబ్రవరి 7: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామీణ గృహానికి తాగునీరు అందించాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు గ్రామ సర్పంచ్ దీప్తి పేర్కొన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయం మిల్క్ డైరీ ఎదురుగా జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా సుమారు రూ.18 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్, పైపులైనుకు భూమిపూజ చేసినట్లు సర్పంచ్ దీప్తి తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి సురక్షిత మంచినీరు అందించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల్‌జీవన్ మిషన్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ, ఏఈ ప్రతాప్‌రెడ్డి, గోరాన్‌చెరువు గ్రామ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అంధులకు రూ.70 వేల ఆర్థిక సాయం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 7: రైల్వేకోడూరులోని ధరణి స్కూలు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయుడు సుకుమార్ పట్టణంలోని అంధులకు బుధవారం రూ.70 వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపును కోల్పోయిన వారు లోకాన్ని చూడలేక ఇబ్బంది పడుతుంటారని, వారికి తన పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని తనవంతుగా ఈ సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎంఈవో-2 సుందర్‌బాబు, ధరణి విద్యా సంస్థ అధినేతలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సిద్దవటం, ఫిబ్రవరి 7: సమాజ్‌వాదీ పార్టీ ఇన్‌చార్జిలు ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భవనాసి వెంకటసుబ్బరాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని కనుమలోపల్లె సమాజ్‌వాదీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉమ్మడి కడప జిల్లాలోని ఇన్‌చార్జిలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గజ్జల వెంకటసుబ్బారెడ్డి, అన్ని నియోజకవర్గ ఇన్‌చార్జులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు బాధ్యతతో నిర్వహించాలి


ఎన్నికల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, హాజరైన అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 7: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల విధులను బాధ్యతతో నిర్వహించాలని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్‌లతో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన అధికారులందరూ గతంలో ఎన్నోసార్లు ఎన్నికల విధులు నిర్వహించినా, ఇప్పుడూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని డెత్ సర్టిఫికెట్లను పరిశీలించాలన్నారు. పత్రికల్లో వచ్చే వార్తలపై ఏఈఆర్వోల నుంచి పూర్తి వివరాలు తెప్పించాలని, రాజకీయ పార్టీ నాయకులు అందించే ఫిర్యాదులను ఎన్నికల విభాగ డిప్యూటీ కలెక్టర్ ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. మండల పరిధిలో ఒక ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన పుల్లయ్య బుధవారం కలెక్టర్ షన్మోహన్, జేసీ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు.

పన్నుల వసూళ్లలో పలమనేరు ఫస్టు - కుప్పం లాస్టు

పలమనేరు, ఫిబ్రవరి7 : జిల్లాలోని ఒక కార్పొరేషన్, నాలుగు మున్సిపాలిటీల్లో ఈ ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి 7వ తేదీ నాటికి పన్నుల వసూళ్లలో పలమనేరు మున్సిపాలిటీ అగ్రస్థానంలో ఉండగా కుప్పం మున్సిపాలిటీ చివరి స్థానంలో వుంది. చిత్తూరు కార్పొరేషన్‌లో ఈ ఏడాది డిమాండు రూ. 22.69 కోట్లకు గాను ఇప్పటికి వసూలు చేసింది రూ. 12.48 కోట్లు(55 శాతం), కుప్పం మున్సిపాలిటీలో డిమాండు రూ. 4.85 కోట్లు కాగా వసూలు చేసింది రూ. 1.45 కోట్లు(29.90 శాతం), పుంగనూరు మున్సిపాలిటి డిమాండు రూ. 4.84 కోట్లు కాగా వసూలు చేసింది రూ. 2.28 కోట్లు (47.11శాతం), నగిరి మున్సిపాలిటీ డిమాండు రూ. 3.42 కోట్లు కాగా వసూలు చేసింది రూ. 1.88 కోట్లు(55 శాతం), పలమనేరు మున్సిపాలిటీ డిమాండు రూ. 2.92 కోట్లు కాగా వసూలు చేసింది రూ.1.86 కోట్లు(63.70 శాతం) వసూలు చేశాయి. గత సంవత్సరం తో పోల్చుకొంటే జిల్లాలో చిత్తూరు కార్పొరేషన్‌తో మొదలు జిల్లాలోని మిగిలిన మూడు మున్సిపాలిటీల్లో కూడా వసూళ్ల శాతం పడిపోయింది. గత సంవత్సరం ఫిబ్రవరినాటికి పోల్చితే చిత్తూరు కార్పొరేషన్10.40 శాతం, కుప్పం 39 శాతం, పుంగనూరు 15.80 శాతం, నగిరి 1.10 శాతం తగ్గిపోగా, పలమనేరు మున్సిపాలిటీలో మాత్రం గత సంవత్సరం కంటే 1.20 శాతం పెరగడం గమనార్హం, ఇక జిల్లా మొత్తం మీద గత సంవత్సం ఫిబ్రవరిలో 12.30 శాతం పన్నుల వసూళ్లలో వెనుకబడి వుంది.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.21 కోట్లు



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 7: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి ఆలయ హుండీ ద్వారా రూ.1,21,92,097 సమకూరినట్లు లభించినట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. బుధవారం స్వామి కానుకలను లెక్కించారు. ఇందులో 22 గ్రాముల బంగారు, 1.5 కిలోల వెండితో పాటు 626 యూఎస్‌ఏ, 60 ఆస్ట్రేలియా, 130 కెనడా డాలర్లు, 20 ఇంగ్లాండ్ పౌండ్లు, 35 యూఏఈ దిర్హామ్స్, 428 మలేసియా రింగిట్స్, 45 యూరోలు లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎస్వీకృష్ణారెడ్డి, రవీంద్ర బాబు, విద్యాసాగర్‌రెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్ బాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేలం పాటల ద్వారా బోయకొండకు రూ.3.18 కోట్లు ఆదాయం

చౌడేపల్లె, ఫిబ్రవరి7: వేలం పాటల ద్వారా బోయకొండ గంగమ్మ ఆలయానికి రూ.3.18కోట్లు ఆదాయం చేకూరినట్లు ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం బోయకొండ గంగమ్మ ఆలయ ప్రధాన కార్యాలయంలో వేలంపాటలు నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజ సామగ్రి విక్రయించే హక్కును రూ.50.27లక్షలతో కె.రమణ దక్కించుకున్నారు. పూలహారాలు, నిమ్మకాయల హారాలు, వడిబాల సామగ్రి, చీరలు, జాకెట్ పీసులు విక్రయించుకునే హక్కును రూ.40లక్షలకు రఘుపతి దక్కించుకున్నారు. అలాగే పెద్దభోగం, చిన్న భోగం సేకరించే హక్కును రూ.90.04లక్షలకు లోకేష్ దక్కించుకున్నారు. అలాగే పెద్ద భోగం, చిన్న భోగం శుభ్రపరిచి ఇచ్చే హక్కును రూ.57.02లక్షలకు సురేష్‌బాబు దక్కించుకున్నారు. కొండపై క్లాక్‌రూం నిర్వహణ హక్కును రూ.36.40లక్షలకు వెంకటరమణ దక్కించుకున్నారు. అలాగే చీరలు, రవికలు సేకరించుకునే హక్కును రూ.45.01కు లతితమ్మ దక్కించుకున్నారు. బుధవారం నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.3,18,74,000 ఆదాయం ఆలయానికి చేకూరింది. గతేడాది కన్నా రూ.56,38,884 అధికంగా ఆదాయం చేకూరినట్లు తెలిపారు. టోల్ గేట్ మాత్రం వాయిదా పడినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామదాసు, భారతి, బుడ్డమ్మ, పవన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, హైమావతి, రెడ్డెమ్మ, సర్పంచ్ సోనియ, కార్యదర్శి వసుంధర, ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

రథసప్తమి ఏర్పాట్లు ప్రారంభం



వాహన మండపం వద్ద వేస్తున్న ముగ్గులు - గ్యాలరీల్లో ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

తిరుమల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో రథసప్తమి ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈనెల 16వ తేదీన సూర్య జయంతి సందర్భంగా తిరుమలలో వేంకటేశ్వర స్వామి ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం సూర్యప్రభ వాహనంతో ఉత్సవాలు ప్రారంభమై చిన్నశేషవాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, చంద్రప్రభ వాహనాలు జరుగుతాయి. తిరుమలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. వాహన మండపాన్ని రంగు ముగ్గులతో సౌందర్యవంతంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులు వేచి ఉండే గ్యాలరీలపై చలువ పందిళ్లు వేస్తున్నారు. విద్యుత్ అలంకరణ పనులు మొదలయ్యాయి. గ్యాలరీల్లో తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి కొళాయిలను సిద్ధం చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 64,345 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,788 మంది తలనీలాలు సమర్పించారు.

స్పీడ్ స్కేటింగ్‌లో తిరుపతి క్రీడాకారుల ప్రతిభ


స్కేటింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా క్రీడాధికారి సయ్యద్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 7: తమిళనాడు కోయంబత్తూరులో గతవారం జరిగిన స్పీడ్ స్కేటింగ్ పోటీలలో తిరుపతికి చెందిన క్రీడాకారులు ప్రతిభచాటారు. 18రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొనగా తొలి స్థానం తమిళనాడు, రెండో స్థానం ఆంధ్రాకు లభించింది. తిరుపతి జిల్లా నుంచి 20మంది క్రీడాకారులు హాజరుకాగా 9మంది మెడల్స్ సాధించారు. అండర్ -16బాలికల విభాగంలో నిఖిల(ఒక రజితం, రెండు కాంస్య) అండర్-12 విభాగంలో లికిత(స్వర్ణం), అండర్-6 విభాగంలో పూజశ్రీ(రజితం), అండర్ 12 బాలుర విభాగంలో దైవిక్, జశ్వంత్(కాంస్యం), రోషన్‌యాదవ్ (రజితం, కాంస్యం), ఇదీష్‌రెడ్డి(రజితం, కాంస్యం), అండర్ -14విభాగంలో చరణ్‌సాయి(రజితం), అండర్-6 విభాగంలో తరుణ్(కాంస్యం) సాధించారు. ఓవరాల్‌గా రెండోస్థానం కైవసం చేసుకోవడంతో కప్ బహుమతిగా అందజేశారు. బుధవారం జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా స్కేటింగ్ కోచ్ వి.జి.ప్రేమ్‌నాథ్, అసిస్టెంట్ కోచ్‌లు కావ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభలా.. రా కదలిరా

పోలీసులు అడ్డుకున్నా తరలివచ్చిన జనం ● కృతజ్ఞతలు తెలిపిన టీడీపీ నేతలు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 7: జీడీ నెల్లూరులో మంగళవారం జరిగిన రా కదలి రా.. సభలో జనాన్ని చూస్తుంటే టీడీపీ విజయోత్సవ సభలా అనిపించిందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఇన్‌చార్జ్ థామస్ పేర్కొన్నారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ పార్టీ కార్యాలయంలో బుధవారం వీరు విలేకరులతో మాట్లాడారు. సభ విజయవంతంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. లక్షన్నర మందికి పైగా సభకు వచ్చారని, జిల్లాలో ఎన్నడు కనీవినీ ఎరుగని రీతిలో ఈ సభ జరిగిందన్నారు. పోలీసులు అడ్డుకునేందకు ఎంత ప్రయత్నించినా ప్రజలు, కార్యకర్తలు, నాయకులు దాన్ని పటాపంచలు చేసి సభకు హాజరయ్యారన్నారు. ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టినా రెండు, మూడు కిలో మీటర్లు నడుచుకుంటూ వచ్చారన్నారు. వైసీపీని తరిమికొట్టేందుకు, నారాయణస్వామిని ఓడించేందుకు జనం ఎంత ఆతృతగా ఉన్నారో ఈ సభనుచేస్తే అర్థమవుతుందన్నారు.టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ బస్సులు ఇవ్వకున్నా... ప్రైవేటు బస్సులను ఇబ్బంది పెట్టినా...టీడీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా వాహనాల్లో తరలివచ్చారన్నారు. ఈ సమావేశంలో నాయకులు సురేంద్రకుమార్, కోదండ యాదవ్, కటారి హేమలత, మోహన్‌రాజ్, మేషాక్, చిట్టిబాబు, రుద్రయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: రా.. కదలిరా సభను విజయవంతం చేసిన వారికి పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ మురళీమోహన్, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి కృతజ్ఞతలు తెలిపారు. సభకు నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావడం సంతోషంగా ఉందన్నారు.



మామిడి చెట్లను ధ్వంసం చేసిన రెవెన్యూ అధికారులు - ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మీరే పాసుబుక్కులిచ్చి.. మీరే చెట్లు నరికేస్తారా..?

● అధికారులపై మాజీ సర్పంచి కుటుంబీకుల ఆగ్రహం


షెడ్డును తొలగించిన అధికారులు

గుడిపాల, ఫిబ్రవరి 7: గుడిపాల మండలం నారగల్లు మారుమూల ప్రాంతంలో 2006లో రెవెన్యూ అధికారులే పాసుబుక్కులు జారీచేసి, ఇప్పుడు సమాచారం లేకుండా చెట్లు తొలగించడం ఎంతవరకు సబబని మాజీ సర్పంచ్ నాగరాజ్ కుటుంబసభ్యులు ప్రశ్నించారు. వివరాలిలా వున్నాయి. 2006లో లెప్రసీ కాలనీకి చెందిన ఇద్దరు ఎస్టీలకు రెవెన్యూ అధికారులు భూమి హక్కు కల్పించారు. అదే నారగల్లు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నాగరాజ్ కుటుంబసభ్యులైన రవికుమార్, చిన్నబ్బ, చిట్టిబాబు, చంద్రమ్మ, కుమారికి కూడా అదేస్థలంలో భూములు ఇచ్చి పాసుబుక్కులను జారీచేశారు. మూడు రోజుల కిందట లెప్రసీ కాలనీవాసులు తమ భూమిని నారగల్లు గ్రామస్తులు ఆక్రమించుకున్నారని, తమకు ఇళ్ల స్థలాలు కల్పించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో రెవెన్యూ అధికారులు మంగళవారం రాత్రి నాగరాజ్ కుటుంబసభ్యులు పెంచుతున్న మామిడి చెట్లను, షెడ్డును ఎక్స్‌కవేటరు ద్వారా తొలగించారు. ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు నాటారు. దీనిపై బుధవారం వీఆర్వోను వివరణ కోరగా, లెప్రసీ కాలనీవాసులు అందరూ తమిళనాడులో ఉంటున్నారని, ఇక్కడ ఎటువంటి ఆధారాలు లేవని చెప్పారు. అదేవిధంగా నాగరాజ్ కుటుంబ సభ్యులకు కూడా ఎటువంటి రికార్డులు లేనందున ఇది ప్రభుత్వ భూమి అని తెలిపారు. సర్వే నెంబరు 461 బ్లాక్‌లో ఉన్న ప్రభుత్వ భూమి ఇటు లెప్రసీ కాలనీవాసులకు, అటు నాగరాజ్ కుటుంబ సభ్యులకు చెందదని స్పష్టంచేశారు. కాగా, ఈ సర్వే నెంబరుకు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను ఇతరులు ఆక్రమించుకున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రామచంద్రయాదవ్‌పై మరో రెండు కేసులు

గోడగడియారాల్లో మద్యం టెట్రాప్యాకెట్లు ఉన్నాయన్న పోలీసులు ● ఈ కేసుల్లో ఒకరి అరెస్టు

పుంగనూరు, ఫిబ్రవరి7: బీసీవై పార్టీ అధ్యక్షుడు బి. రామచంద్రయాదవ్‌పై పుంగనూరు పోలీసులు బుధవారం రెండు కేసులు నమోదు చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి భారీ ఎత్తున గోడ గడియారాలు తెప్పించారనే సమాచారంతో మంగళవారం పుంగనూరు, తిమ్మికృష్ణాపురంలో దాడులు నిర్వహించి గోడ గడియారాలను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. పుంగనూరు ఎల్‌బీసీ కాలనీలో సీజ్ చేసిన 4059 గోడగడియారాలతో పాటు కర్ణాటక మద్యం 489 ప్యాకెట్లు ఉన్నట్లు పుంగనూరు సీఐ రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు రామచంద్రయాదవ్‌పై కేసు నమోదు చేశారు. చదళ్ల సమీపంలోని తిమ్మికృష్ణాపురంలో శివకుమార్ ఇంటిలో చౌడేపల్లె సీఐ కృష్ణారెడ్డి తనిఖీ చేసి 5995 గోడగడియారాలు, 489 మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇంటి యజమాని శివకుమార్‌ను అరెస్ట్‌చేసి రామచంద్రయాదవ్‌పై కేసునమోదు చేశారు.

మంత్రి పెద్దిరెడ్డి కాపలా కుక్కల్లా..

పుంగనూరు సీఐతో పాటు కొందరు పోలీసు అధికారులు మంత్రి పెద్దిరెడ్డి కాపలా కుక్కల్లా పని చేయడం దారుణమని బీసీవైపార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర విమర్శ చేశారు. గోడగడియారాల మధ్య కర్ణాటక మద్యం పెట్టి అక్రమ కేసులు పెట్టారంటూ సీఐపై విమర్శలు చేశారు. పిరికిపంద పెద్దిరెడ్డికి వైసీపీ కార్యకర్తలపై నమ్మకంలేక పోలీసులతో రాజకీయం చేయిస్తున్నాడన్నారు. పోలీసుల అధికార దుర్వినియోగం, అక్రమాలపై న్యాయపోరాటం చేస్తానన్నారు.

వలంటీర్లకు ఎన్నికల పాఠాలు

●శ్రీకాళహస్తిలో రహస్య సమావేశం


ఎఫ్‌ఓఏ సమావేశంలో వలంటీర్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7: వలంటీర్లను పూర్తిస్థాయి వైసీపీ రాజకీయ కార్యకర్తలుగా ఎన్నికల్లో వినియోగించుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తిలో బుధవారం వలంటీర్లను సమావేశపరచి రాజకీయ పాఠాలు బోధించారు.ఎఫ్‌ఓఏ (ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజన్సీ) సమావేశం ఉందంటూ శ్రీకాళహస్తి పట్టణంలోని 9 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సమాచారం అందింది. ప్రభుత్వ పథకాల అమలు, ప్రచారం గురించి శిక్షణ ఇచ్చే ఎఫ్‌ఓఏ సమావేశాలు సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లోనే జరుగుతుంటాయి.ఈ సమావేశం మాత్రం పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథిగృహంలో నిర్వహించారు. పట్టణంలోని 22 సచివాలయాల్లో సినిమా వీధి 1, సినిమా వీధి 2, సినిమా వీధి 3, దోబీ ఘాట్, పెద్ద మసీదు వీధి, ఎంఎం వాడ 1, ఎంఎం వాడ 2, తెలుగు గంగ కాలనీ, జయరాం రావు వీధి సచివాలయాల పరిధిలోని వలంటీర్లను మాత్రమే తొలివిడత సమావేశానికి పిలిచారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలను పాఠాలుగా వీరికి బోధించారు. వలంటీర్ల వద్ద ఇప్పటికే ఉన్న పౌర, ఓటర్ల సమాచారాన్ని ఎలా ఉపయోగించుకోవాలో సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎలా అనుకూలంగా మార్చుకోవాలి, బయట ప్రాంతాల్లో నివసించే స్థానిక ఓటర్లు ఎవరు, పోలింగ్ సమయంలో వారిని ఎలా తీసుకురావాలి, పక్కాగా వైసీపీ వ్యతిరేక ఓటర్లు ఎవరో గుర్తించి జాబితాలు సిద్ధం చేయడం వంటి పనులను వారికి వివరించారు. సమాచారం తెలిసి మీడియా ప్రతినిధులు వెళ్లగానే కొందరు వలంటీర్లు ఫొటోల్లో కనిపించకుండా ముఖం పక్కకి తిప్పేశారు. ఇది సాధారణ ఎఫ్‌ఓఏ సమావేశం మాత్రమే అని నిర్వాహకులు వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.





శ్రీవేంకటేశ్వర గోష్టిగానంతో పులకించిన సప్తగిరులు

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కల్యాణ వేదికలో 300 మంది కళాకారులు ఆలపించిన పురందరదాస కీర్తనలతో తిరుమల సప్తగిరులు పులకించాయి. పురందరదాస ఆరాధన మహోత్సవాల ప్రారంభ నేపథ్యంలో బుధవారం సాయంత్రం 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాల' సంకీర్తనా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పురందరదాస కృతులను కళాకారులు ఆలపించారు. 'దాసన మాడికో ఎన్న.., ఇందు నిన్న స్మరయ.., వేంకటేశనే.., తిరుపతి వెంకటరమణ.., శోభానే శోభానే.., వంటి కీర్తనలు ఆకట్టుకున్నాయి. దాససాహిత్య ప్రాజెక్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, ప్రముఖ సంగీతకారిణి ద్వారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పురందరదాస ఆరాధనోత్సవాలు

కర్ణాటక సంగీత పితామహులు పురందర దాస ఆరాధనా మహోత్సవాలు తిరుమల ఆస్థాన మండపంలో గురువారంనుంచి మూడు రోజుల పాటు జరుగనున్నాయి. తొలి రోజు సుప్రభాత, ధ్యానం, సామూహిక భజన, నగరసంకీర్తన, పురందర సాహిత్య గోష్ఠి, పీఠాధిపతులు మంగళాశాసనాలు, సంకీర్తనమాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు అలిపిరిలోని పురందర దాసు విగ్రహానికి పుష్పమాలను సమర్పిస్తారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి నారాయణగిరి ఉద్యానవనంకు శ్రీవారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఊంజల్‌సేవ, దాససంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరిరోజు సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగరసంకీర్తన, హరిదాస రసరంజని కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అర్చకులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 7: ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. టీటీడీ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు శ్రీవేంకటేశ్వర ఉద్యోగుల శిక్షణ సంస్థ (శ్వేత) ఆధ్వర్యంలో ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో జరుగుతున్న శిక్షణా తరగతులు రెండవ రోజైన బుధవారం మన ఆరోగ్యం మన చేతుల్లోనే అనే అంశంపై ఆయన మాట్లాడుతూ వైద్యశాస్త్రంలో వ్యాయామానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అర్చకులు నిత్యం యోగ, ధ్యానం, వ్యాయామం చేయడం ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చునని తెలిపారు. అనంతరం తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు రామకృష్ణదీక్షితులు వైఖానస ఆగమంలోని విశేషాలను అర్చకులకు విపులీకరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు పి. సీతారామాచార్యులు, టీటీడీ ఆలయాల వైఖానస అర్చకులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవోను ఎందుకు బదిలీ చేయలేదు

● ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు

చిత్తూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో అందరు అధికారుల్ని బదిలీ చేస్తున్నా చిత్తూరు జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిని మాత్రం బదిలీ చేయకుండా ఆపారని రాష్ట్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. ఇదే జిల్లాకు చెందిన ఈయన్ను వెంటనే బదిలీ చేయాలని పేర్కొంది. ఈ మేరకు బుధవారం శాసనమండలి మాజీ ఛైర్మన్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు షరీఫ్ ఎన్నికల సంఘానికి లెటర్ రాశారు. 'జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి చిత్తూరు జిల్లాకు చెందినవారు. జిల్లా పరిషత్‌లో 27 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం ఆయన బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా రెగ్యులర్ పోస్టులో ఉంటూ, జడ్పీ ఏవోగా, డిప్యూటీ సీఈవోగా, సీఈవోగా మూడు అదనపు పోస్టుల్లో కొనసాగుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు కొత్తగా ఎంపీడీవోలకు నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎమ్మెల్యేలు చెప్పినట్లు మండలాలు కేటాయిస్తున్నారు. వెంటనే ఈయన్ను బదిలీ చేయండి'అని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 337 టీచర్ పోస్టుల భర్తీ

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 7: డీఎస్సీకి సంబంధించి ఈనెల 12న ప్రారంభమైన ప్రక్రియను అనుసరించి ఉమ్మడి జిల్లాలో 337 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) 101 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ 97 పోస్టులు, ట్రెయిన్డ్ గ్రేడ్ టీచర్స్ 139 పోస్టులతో పాటు ఒక ప్రిన్సిపాల్ పోస్టు సైతం భర్తీ కానుంది. కాగా, ఐదేళ్లుగా ఉలుకూ పలుకూ లేకుండా ఉండి, ఎన్నికలు సమీపించే సమయంలో డీఎస్సీ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే డీఎస్సీ ప్రక్రియ ఆగిపోతుందనే ఆందోళనతోనూ, నిరాశతోనూ నిరుద్యోగులు ఉన్నారు.

15న ప్రాంతీయ జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 7: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థచే ఈనెల 15న చిత్తూరులోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో ప్రాంతీయ జాబ్‌మేళా జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం జాబ్‌మేళాకు సంబంధించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జాబ్‌మేళాకు సంబంధించి వార్డు, గ్రామ సచివాలయ పరిధిలో అర్హత కల్గిన వారికి సమాచారం చేరవేయాలన్నారు. ఈ జాబ్‌మేళాలో వందకు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. పదో తరగతి నుంచి పీజీ వరకు పాస్ లేదా ఫెయిలైన 18- 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. ఇతర వివరాలకు 90635 61780, 94932 10966 నెంబర్లలో సంప్రదించాలని రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్‌మోహన్ సూచించారు. అధికారులు ఎన్.గుణశేఖర్ రెడ్డి, ఎం.ఏకాంబరం, జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ చైతన్య, వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేయండి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 7: జర్నలిస్టులతో హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ షన్మోహన్ మీడియా ప్రతినిధులకు సూచించారు. బుధవారం జరిగిన జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మీడియా ప్రతినిధులకు గుర్తించిన భూములను సర్వేచేసి, సరిహద్దు రాళ్లను నాటాలన్నారు. పుంగనూరు, వి.కోట ప్రాంతాల్లో త్వరితగతిన భూమిని గుర్తించాలని పలమనేరు ఆర్డీవో శ్రీనివాసులును ఆదేశించారు. సమావేశంలో జేసీ పి.శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, ఆర్డీవోలు చిన్నయ్య, మనోజ్‌కుమార్, సర్వే అధికారి గౌస్ బాషా, డీపీఆర్వో పద్మజ, తహసీల్దార్లు, ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భార్యపై అనుమానం

నిద్రిస్తుండగా కత్తితో దాడి చేసి పరారైన భర్త


ఆస్పత్రికి అంబులెన్సులో రత్నమ్మ తరలింపు

కేవీబీపురం, ఫిబ్రవరి7: నిద్రపోతున్న భార్యపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసిన భర్త పైశాచికత్వమిది.ఎస్‌ఐ సునీల్ కథనం మేరకు...కేవీబీపురం మండలంలోని కస్తూరిపురం గిరిజన కాలనీలో దంపతులు చంద్రయ్య,రత్నమ్మ(32) ఎనిమిదేళ్లుగా నివసిస్తున్నారు.మూడవ భార్య అయిన రత్నమ్మపై చంద్రయ్యలో ఇటీవల అనుమానబీజం మొలకెత్తడంతో పలుమార్లు గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి రత్నమ్మ తన కుమారుడితో ఇంట్లో నిద్రిస్తుండగా చంద్రయ్య ఇంటి బయట పడుకున్నాడు. సుమారు 11గంటల సమయంలో కత్తితో భార్యపైన విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి పరారయ్యాడు. గాయపడిన రత్నమ్మను 108 అంబులెన్సులో పోలీసులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రత్నమ్మ పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.

వెంకన్న సేవలో ఎల్లా వేంకటేశ్వరరావు



తిరుమల, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారుడు ఎల్లా వేంకటేశ్వరరావు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 60 ఏళ్లుగా తిరుమలకు వస్తున్నానని, ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతున్నాయని అన్నారు. చిరంజీవి, వెంకయ్యానాయుడికి పద్మవిభూషణ్ పురస్కారం రావడం సంతోషకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం కళాకారులను గుర్తిస్తుంటే ఇక్కడి వారు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

గుర్రంకొండ ఎంపీడీవోగా జగదీశ్వరరెడ్డి



గుర్రంకొండ, ఫిబ్రవరి 7: గుర్రంకొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఏ.జగదీశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో వెంకటేశులు బదిలీపై కడప జిల్లాకు వెళ్లారు. కడప జిల్లా దువ్వూరు మండలంలో పని చేస్తున్న జగదీశ్వర రెడ్డిని గుర్రంకొండ ఎంపీడీవోగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

ఎస్‌ఐగా శ్రీనివాస నాయక్

గుర్రంకొండ పోలీస్ స్టేషన్ రెండవ ఎస్‌ఐగా శ్రీనివాస నాయక్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లాపోలీస్ కార్యాలయంలో పనిచేసేవారు.

పెద్దతిప్పసముద్రం ఎంపీడీవోగా బ్రహ్మానందరెడ్డి



పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 7: పెద్దతిప్పసముద్రం ఎం పీడీవోగా బ్రహ్మానందరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న గిరిధర్ రెడ్డిని ఇదే కార్యాలయంలో ఏవోగా నియమించి, గుర్రంకొండలో ఈవోఆర్డీగాపని చేస్తున్న బ్రహ్మానందరెడ్డిని పెద్దతిప్ప సముద్రం ఎంపీడీవోగా నియమించారు. మండల ప్రజాప్రతినిధులు ఆయనను శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

నిమ్మనపల్లి ఎంపీడీవోగా మైథిలి



నిమ్మనపల్లి, ఫిబ్రవరి 7: నిమ్మనపల్లి ఎంపీడీవోగా బుధవారం మైథిలి భాధ్యతలు చేపట్టారు ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో శేషాద్రి నెల్లూరు జిల్లా సంగం మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో ఈమె నియమితులయ్యారు. గ్రామాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

కలికిరి ఎంపీడీవోగా రామకృష్ణయ్య

కలికిరి, ఫిబ్రవరి 7: కలికిరి ఎంపీడీవోగా సి.రామకృష్ణయ్య బా. ధ్యతలు చేపట్టారు. ఎన్నికల నిబం. దనల మేరకు అనంతపురం జిల్లా నుంచి కలికిరికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేసిన గంగయ్యను నె ల్లూరు జిల్లా రాపూరు మండలానికి బదిలీ చేశారు.

ములకలచెరువు తహసీల్దార్‌గా అనిల్‌కుమార్



ములకలచెరువు, ఫిబ్రవరి 7: ములకలచెరువు తహసీల్దార్‌గా అనిల్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా వజ్రకరూర్ మండలంలో పని చేస్తున్న అనిల్ కుమార్ నియమితులయ్యారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

కలకడ, ఫిబ్రవరి 7: స్థానిక ప్రాథమిక సహకార సంఘంలో ఖాతాదారులైన వారు ఈ నెల 12లోగా ఈకేవైసీ చేయించుకోవాలని చైర్మన్ వెంకటరమణరెడ్డి, సీఈవో నాగేంద్రబాబు కోరారు. కేంద్ర సహకార మంత్రిత్వశాఖ సంస్కరణలో భాగంగా బ్యాంక్ డిజిటలేషన్‌కు మారుతుందన్నారు. ఇందుకు గాను డిపాజిట్‌దారులు, రుణగ్రహీతలు రెండు ఫొటోలు, ఆధార్, పాన్ కార్డు, నామినీ వివరాలను అందజేయాలన్నారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

కలకడ, ఫిబ్రవరి 7: ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ గణేష్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం కలకడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కేసును సీబీసీఐడీకి అప్పగించాలని డిమాండు చేశారు. మృతుడి కుటుంబానికి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులరెడ్డి, రామాంజులు, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, చెన్నమనాయుడులు పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో స్థల వివాదం



వాగ్వాదం చేస్తున్న ఇరువర్గాలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7: మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ టీచర్స్ కాలనీలో స్థల వివాదం నెలకొంది. ఒక వర్గం స్థలం కొనుగోలు చేశా మని చెబుతుండగా, ఆ స్థలం కాలనీప్రయోజనాలకు కేటాయించిందని మరో వర్గం గొడవ పడ్డారు. లేవుట్‌లో కాలనీ అవసరాలకు కేటాయించిన స్థలంలో కూసాలు నాటే పనులను కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మద్దిరెడ్డి, బండి ఆనంద్ సభ్యులతో కలిసి అడ్డుకున్నారు. ఈ స్థలం కొనుగోలు చేసినట్లు మరో వర్గం పత్రాలను చూపుతోంది. గ్రామ సర్పంచ్ శరత్‌రెడ్డి, సచివాలయ సర్వేయర్ నాయక్ అక్కడికి చేరుకుని లేవుట్‌లో రోడు కోసం ఈ స్థలం కేటాయించినట్లు తెలిపారు. రికార్డులు ఉంటే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాని సూచించారు.

పీలేరు నుంచి శెట్టిపల్లెకు బస్సు

సంబేపల్లె, ఫిబ్రవరి 7: అన్నమయ్య జిల్లా పీలేరు ఆర్టీసీ డిపో నుంచి సంబేపల్లె మండలం శెట్టిపల్లెకు బుధవారం నుంచి నూతనంగా బస్ సర్వీస్ ఏర్పాటు చేశారు. పీలేరు నుంచి కలకడ, గుట్టపల్లె క్రాస్, పెద్దబిడికి, వడ్డెపల్లె క్రాస్ మీదుగా శెట్టిపల్లెకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. బస్సు ఉదయం 8.20 నిమిషాలకు, సాయంత్రం 4.20 నిమిషాలకు రోజుకు రెండు ట్రిప్పులు శెట్టిపల్లెకు వస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కాగా శెట్టిపల్లె గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా రమాబాయి జయంతి వేడుకలు



పీలేరు: రమాబాయికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు



మదనపల్లె: రమాబాయికి నివాళులర్పిస్తున్న బాస్ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 7: రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ సతీమణి రమాబాయి 126వ జయంతిని బుధవారం పీలేరులో పలు ప్రజా సంఘాలు ఘనంగా నిర్వహించాయి. చిత్తూరు మార్గంలోని కోళ్లఫారం వద్ద జరిగిన కార్యక్రమంలో బాస్, మాలమహానాడు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ మాతా రమాబాయిని చరిత్ర 'సింబల్ ఆఫ్ శాక్రిఫైస్'గా గుర్తు పెట్టుకుంటుందని, ఆమె చేసిన త్యాగాల కారణంగా డా.బి.ఆర్. అంబేడ్కర్ ప్రపంచం గ ర్వించదగ్గ మేధావిగా అవతరించారని కొనియాడారు. వేపులబైలు పంచాయతీ వరంపాటివారి పల్లెలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో ఎంఎస్‌పీ నేత గండికోట వెంకటేశ్ మాట్లాడు తూ కళ్ల ముందు కన్నబిడ్డలు కడతేరిపోతున్నా పుత్రశోకాన్ని దిగమింగి రాజ్యాంగ రచనలో అంబేడ్కర్‌కు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసుకున్న త్యాగశీలి రమాబాయి అని గుర్తు చేసుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పీలేరులోని గ్రేట్ విజన్ సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యుడు డా.జీవీఎస్ బాబు, ధనంజ య, డా.టి.రఘునాథ్, శ్రీరాములు రమాబాయి సేవలను స్మరించుకున్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో నాయకులు తుమ్మల ధరణీ కుమార్, పాలకుంట శ్రీనివాసులు, జెట్టి మల్లికా ర్జున, నగరిమడుగు సుభాష్, చీకటిపల్లె మల్లికార్జున, రెడ్డయ్య, సురేంద్ర, భువన్ కుమార్, పురుషోత్తం, నరసింహులు, చరణ్ కుమార్, శ్రీకాంత్, సాయివంశీ, భాను, అనిరుద్, ప్రవల్లిక, సుస్మిత, మంజుల, నరసమ్మ, అనూరాధ, మీనా, కవిత, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతి వేడుకలు బాస్ కార్యాలయంలో బాస్, వీసీకే పార్టీ సంయుక్తంగా ఘనంగా నిర్వహించారు. రమా బాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఈ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవడానికి ఎంతో సహకరిం చిన రమాబాయి జీవితం గురించి వివరించారు. ఆమె చేసిన త్యాగం అమూల్యమైందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజాకవి రెడ్డెప్ప, రెడ్డిప్రసాద్, రెడ్డెప్ప, సూరి, హైదర్, పవన్, తేజా, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



కలకడ: అధికారులకు సూచనలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



మదనపల్లె: పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్



గుట్టపాలెంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ మోహన్

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి: జేసీ

కలకడ, ఫిబ్రవరి 7:పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులను కల్పిం చాలని జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని నడిమి చెర్ల, కోన, గంగిరెడ్డిగారిపల్లె, గుడిబండ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవనాలు, తాగునీరు, విద్యుత్, మరుగు దొడ్లు తదితరాలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి, ఎంఈవో మునీంద్రనాయక్, రమణయ్య పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా పట్టణంలో పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో హరిప్రసాద్ పరిశీలించారు. బుధవారం స్థానిక ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో కలిసి పోలింగ్ కేంద్రంలోని గదులు, పరిసరాలు, సౌకర్యాలను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరి: గుట్టపాలెం పంచాయతీలోని గుట్టపాలెం, యల్లంపల్లెలోని పోలింగ్ కేంద్రాలను కలికిరి ఇన్‌స్పెక్టర్ ఆర్. మోహన్ బుధవారం తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి, ర్యాంపుల ఏర్పాటు, ప్రహరీ గోడలు తదితర అంశాలను పరిశీలించారు. స్థానిక ఓటర్లతో మాట్లాడారు. గతంలో పోలింగ్ సందర్భంగా జరిగే సంఘటనలపై ఆరా తీశారు. సెక్టోరియల్ ఆఫీసర్లు, పోలింగ్ సిబ్బందితో కలిసి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించనున్నట్లు మోహన్ తెలిపారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారిణి మమతా రెడ్డి, ఏఎస్‌ఐ మధుసూదనాచారి, హెచ్‌సీ రఫీ, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

పీలేరు, ఫిబ్రవరి 7: ఈ నెల 9వ తేదీన జరగనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పీలేరు మండలంలోని వైద్య ఆరోగ్య సిబ్బందిని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ్ (ఆర్‌బీఎస్‌కే) జిల్లా కో-ఆర్డినేటర్ డా.శివప్రతాప్ తెలిపారు. బుధవారం పీలేరు ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మండలంలోని వైద్య సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణపై పాఠశాలల్లో పెద్దఎత్తున ప్రచారం చేయాల న్నారు. 9వ తేదీన జరిగే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని మండ లంలోని 1-19 ఏళ్ల మధ్యనున్న పిల్లలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వైద్యాధికారులు కార్తీక్ కుమార్, రమేశ్‌రెడ్డి, ఎంఈవో లోకేశ్వర రెడ్డి, ఏవో సతీశ్, సీహెచ్‌వో జయలక్ష్మి, హెచ్‌ఈ కొండయ్య పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: పిల్లలో రక్తహీనత, వివిధ రకాల అనారోగ్యానికి కారణమవుతున్న నులిపురుగులను నివారించడంతో ఆరోగ్యం సిద్ధిస్తుందని మండల ప్రత్యేకాధికారి సందప్ప తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నులిపురుగుల నివారణకు సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలో కులగణన సర్వే వేగవంతం చేసి వంద శాతం సర్వే పూర్తి చేసేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో త్యాగరాజు, ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆనంద్‌కుమార్, వైద్యాధికారి మునికుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి చర్యలు



తాత్కాలిక భవనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 7: కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రీయ విద్యాలయ సంస్థ డిప్యూటీ కమిషనర్ మంజునాథ తెలిపారు. బుధవారం స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ పక్కన నిర్మించిన తాత్కాలిక భవనాలను ఆర్డీవో హరిప్రసాద్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయ హైస్కూల్ వెనుక వున్న ప్రభుత్వ స్థలాన్ని కేంద్రీయ విద్యాలయానికి మంజూరు చేశారన్నారు అక్కడ భవనాలు నిర్మించేంత వరకు ఈ భవనాల్లో ఈ తరగతులు ప్రారంభిస్తామన్నారు. వారం రోజుల్లో అనుమతి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ అనూరాధ, పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో భానుప్రసాద్, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి పాల్గొనన్నారు.

వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో బి.కొత్తకోట యువతి



ప్రశంసాపత్రంతో కేఎల్‌సీఎస్ వాత్సల్య లక్ష్మి

బి.కొత్తకోట, ఫిబ్రవరి 7: హైదరాబాదులోని అష్టలక్ష్మీ దేవాలయం వేదికగా శివ పంచాక్షరి నాట్య బృందం ఇటీవల నిర్వహించిన జయ జయ కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్న వాత్సల్య లక్ష్మి పేరు వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదైంది. బి.కొత్తకోటకు చెందిన చంద్రశేఖర్, లలితాశేఖర్ కుమార్తె అయిన ఈమె విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత నృత్య కళాశాలలో చందుకుంటోంది. ఈ కళాశాల ఆధ్వర్యంలో జనవరి 28న హైదరాబాదులోని అష్టలక్ష్మీ దేవాలయంలో 365 మంది విద్యార్థినులతో ఏకకాలంలో శివ పంచాక్షరి కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. చల్లా కొండలరావు నేతృత్వంలోని భద్రాద్రి సాంస్కృతిక వారధి సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. సౌత్ ఇండియన్ ఆర్ట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ వారు ఈ ప్రదర్శనను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలో వాత్సల్య శ్రీలక్ష్మీ పాల్గొనడంతో ఏలూరుకు చెందిన అభినవ నృత్య భారతి వారు నర్తన బాల అవార్డు, ప్రశంస పత్రాలు జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె గురువు అజయ్ కుమార్, తల్లితండ్రులు అభినందించారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 7: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం సీటీఎం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (55) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు తెలుపు షర్టు, లుంగీ కట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైనా మిస్సింగ్ అయినట్లు తెలిస్తే 91331009537 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రేపటి నుంచి దేవుని కడప శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 7: తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 19వ తేదీ వరకు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు దేవుని కడప ఆలయ ఏఈవో నటేశ్‌బాబు, ఇన్‌స్పెక్టర్ పేరం ఈశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం, సాయంత్రం వాహనసేవలు జరుగుతాయన్నారు. 10వ తేదీ ఉదయం 10-30 తిరుచ్చివాహనం, రాత్రి 8 గంటలకు చంద్రప్రభవాహనంపై స్వామి దర్శనమిస్తారన్నారు. 11వ తేదీ ఉదయం సూర్యప్రభవాహనం, రాత్రి పెద్దశేషవాహనం, 12వ తేదీ ఉదయం చిన్నశేషవాహనం, అదేరోజు రాత్రి సింహవాహనం, 13వ తేదీ ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి హనుమంతవాహనం, 14వ తేదీ ముత్యపు పందిరి వాహనం, రాత్రి గరుడ వాహనంపై స్వామి ఊరేగు తారన్నారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి గజవాహనం, 16వ తేదీ ఉదయం 6-30 గంటలకు రథారోహణం మధ్యాహ్నం 2 గంటల నుంచి రథోత్సవం, 17వ తేదీ సర్వభూపాల వాహనం రాత్రి అశ్వవాహనం, 18వ తేదీ వసంతోత్సవం, చక్రస్నానం రాత్రి హంసవాహనం, ధ్వజావరోహణం చివరగా 19వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలియజేశారు.

నాటుసారా స్వాధీనం.. ఒకరి అరెస్ట్



నిందితుడితో ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 7: నాటుసారా విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్న ట్లు ఎస్ఐ లోకేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ సోమానపల్లికి చెందిన తుపాకుల శ్రీరాములు(51) నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తలించినట్లు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు



నిందితుడ్ని అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ తిప్పేస్వామి

ములకలచెరువు, ఫిబ్రవరి 7: అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని బుకాయలకోట హైవే రోడ్డు వద్ద మద్యం అమ్ముతున్న బావాజి(40)ని అరెస్టు చేసి అతని నుంచి ఎనిమిది మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎఎస్ఐ నజీర్ అహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

రాజంపేట, ఫిబ్రవరి 7: పట్టణంలో టీడీపీ నేత గంటా నరహరి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న క్యాంటీన్‌ను బుధవారం రాజంపేట పార్లమెంటు టీడీపీ కార్యదర్శి నాగమునిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్‌ను పరిశీలించి పేదలకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలను రుచిచూశారు. పేదలకు అన్నదానం నిర్వహించి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అన్న క్యాంటీన్ ప్రతినిధులు భరత్, ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



మార్కెట్‌యార్డులో ప్రచారం చేస్తున్న శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత

మదనపల్లె, ఫిబ్రవరి 7: టమోటా మార్కెట్‌లోని కూలీలు, నీరుగట్టువారి పల్లె చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని నియోజకవర్గ జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు హామీ ఇచ్చారు. జనంకోసం జనసేనలో భాగంగా బుధవారం పట్టణం లోని కదిరి రోడ్డు, టమోటా మార్కెట్, మాయాబజార్ ఏరియాల్లో పర్యటించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి నిమిత్తం పట్టణానికి వచ్చిన ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా టమోటా మార్కెట్, నీరుగట్టు వారిపల్లెలోని చేనేత రంగంపై ఆధారపడ్డారని ఆయన పేర్కొన్నారు. జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం రాగానే, ఈ రెండువర్గాల ప్రజల సమస్యలపై దృష్టి పెడతా మన్నారు. ఎంతోమందికి ఉపాధి కల్పిస్తూ, ఆదరిస్తున్న టమోటా, చేనేతలకే అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలు, మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరి ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, కోటకొండ చంద్రశేఖర్, సుప్రీంహర్ష, సీటీఎం గంగాధర్, కొణిదల శంకర్, సోను, షేక్ యాసిన్, గణేష్, నవాజ్, పద్మావతి, చంద్రశేఖర్, కుప్పాల శంకర్, జయమ్మ, రెడ్డిరాణి, జనసైనికులు, టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపడం ఖాయం



మీడియాతో మాట్లాడుతున్న పట్టణ టీడీపీ అధ్యక్షుడు భవానీప్రసాద్

మదనపల్లె, ఫిబ్రవరి 7: రానున్న సాధారణ ఎన్నిక ల్లో వైసీపీ ప్రభుత్వా న్ని, సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపడం ఖాయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు జోళపాలెం భవానీప్రసాద్ జోస్యం చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో జరిగిన రా..కదలిరా..! కార్యక్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ప్రజ లు బ్రహ్మరథం పట్టారన్నారు. టీడీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణ ఈ సమావేశంతో తేట తెల్లమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి వెంకట రమణారెడ్డి, మేకల రెడ్డి శేఖర్, పురుషోత్తం, తులసీధర్, సుబ్రహ్మణ్యం, దుర్గా, సాకే కృష్ణమూర్తి, మాకినేని చంద్రశేఖర్, ఆర్‌ఎంపీ రామాంజనేయులు, దాదూ, సికిందర్, నిస్సార్, తదితరులు పాల్గొన్నారు.

'ఎర్రచందనం స్మగ్లర్ల పార్టీ వైసీపీ'



మాట్లాడుతున్న ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 7: వైసీపీ ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే పార్టీ అని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ఆరోపించారు. బుధవారం స్థానిక నిమ్మపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏపీఎస్పీ కానిస్టేబుల్‌ను ఎర్రచందనం స్మగ్లర్లు హత్యచేయడం దారుణమన్నారు. తమ అక్రమాలకు అడ్డుతగులుతున్నాడని విశాఖపట్నం వద్ద ఓ తహసీల్దార్‌ను హత్య చేసిన అధికార పార్టీ నాయకులు, ఇప్పుడు ఎర్రచందనం స్మగ్లర్ల రూపంలో కానిస్టేబుల్ ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అనుకూలంగా వైసీపీ ప్రభుత్వం టాస్క్ ఫోర్సును నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కానిస్టేబుల్ మృతికి వైసీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు..

కాంగ్రెస్ పార్టీలో మహిళల చేరిక



కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న మహిళలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం పెద్ద ఎత్తున మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎస్టీవి కాలనీకి చెందిన ఉమ, వసంత, నిర్మల, కవిత, యశోద, సోనియా, రోజా, రాణి, లక్ష్మమ్మ తదితరులు ప్రభావతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మదనపల్లె నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ఐదేళ్లుగా చవిచూసిన ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం కావడంతో, గతంలో కాంగ్రెస్ పాలనలో అందించిన సంక్షేమాన్ని గుర్తు చేసుకుంటూ బలోపేతం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా, నాయకులు ఎస్‌ఎం రఫీ, సురేంద్రరెడ్డి, మీనాకుమారి, మహబూబ్‌పీర్, మహమ్మద్ అలీ, చలపతి, రవీంద్ర, నాగరాజ, సయ్యద్, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు



ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న ఆర్టీసీ డీఎం నిరంజన్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 7: రోడ్డుభద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ టూ డిపోలో బుధవారం ఆర్టీసీ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఉత్తమ ఉద్యోగులకు క్యాష్ అవార్డులను, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా టూ డిపో మేనేజరు నిరంజన్ మాట్లాడుతూ ఇంధనం పొదుపు, అధిక కేఎంపీఎల్, ఎక్కువగా ఈకేపీ సాధించిన ఉద్యోగులను అభినందించామన్నారు. ప్రమాదరహితంగా వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు గీతా, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమౌళి

పీలేరు, ఫిబ్రవరి 7: 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ చంద్రమౌళి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పీలేరు నియోజకవర్గ ఎన్నికల సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పల్లెకు పోదాం' కార్యక్రమం ద్వారా గత పదేళ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై సామాన్యులకు సైతం అవగాహన కల్పించే అవకాశం లభిస్తుందన్నారు. తద్వారా పార్టీని బలోపేతం చేసుకోవచ్చునన్నారు. అనంతరం మండలాల వారీగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ సామంచి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్, అసెంబ్లీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్, కో-కన్వీనర్ వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డి, కార్యదర్శి గుణశేఖర్, మహదేవనాయుడు, నిమ్మనపల్లె పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

యువతులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాధాదేవి

పీలేరు, ఫిబ్రవరి 7: యువతులు తమకు ఇష్టమైన రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలని నారీ శక్తి అవార్డు గ్రహీత రాధా దేవి తెలిపారు. పీలేరు సీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల లో బుధవారం నిర్వహించిన మహిళా సాధికార సదస్సులో ఆమె మాట్లాడుతూ జనాభాలో సగం ఉన్న మహిళలు తాము ఎంచుకున్న రంగంలోని అవరోధాలను అధిగమించి రాణించినప్పుడే మరికొంత మందికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. అవరోధాలు చూసి కుంగిపోకుండా ముందుకు సాగాలని, ప్రస్తుత కాలంలో మహిళలు ఎందులోనూ తక్కువ కాదన్నారు. అనంతరం వివిధ రంగాల్లోని ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవకాశాలు, వాటిని అందిపుచ్చుకునే విధానాలను ఆమె విద్యార్థిను లకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోడేషావలి, తదితరులు పాల్గొన్నారు.